

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర **రాజముద్ర**
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 07.01.2026 | సంపుటి : 2 | సంచిక :332 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Wednesday | 07.01.2026 | volume : 2 | Issue : 332 | Pages : 8 | Cost : 2/- |



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575




# తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్

### కేసీఆర్ చెప్పు ధూళికి కూడా సరితూగని రేవంత్

### రేవంత్ మాత్రం రియల్ బ్రోకర్

### సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్

**సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పు ధూళికి కూడా సరితూగడని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం జనగామలో బీఆర్ఎస్ తరపున గెలిచిన సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన .. సీఎం రేవంత్‌రెడ్డిపైన, కాంగ్రెస్ ప్రభుత్వంపైన విమర్శల వర్షం గుప్పించారు.**

జనగామ, జనవరి 6 : తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్ అని, అందుకే ఆయన తన తండ్రి అని గర్వంగా చెప్పుకుంటానని కేటీఆర్ అన్నారు. అలాంటి మొనగాడిని సవాలు చేస్తున్న రేవంత్ రెడ్డి అనేటోడు ఆయన చెప్పు ధూళికి కూడా సరిపోడని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్ పెడితెనే రేవంత్ రెడ్డి ఆగమాగం అయితున్నడని, ఆయన అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే అక్కడే గుండె ఆగి సస్తడని అన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధిద్దామని ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్న

-మిగతా 2 లో..

# హిల్ట్ పాలసీలో దోపిడీకి ఆస్కారం లేదు

### పారిశ్రామికవాడల నుంచి కాలుష్య పరిశ్రమలను ఎట్టి పరిస్థితుల్లోనూ తరలిస్తాం



- బీఆర్ఎస్ ప్రభుత్వం లీజు భూములను ఫ్రీహోల్డ్ చేసింది..
- కాలుష్య రహిత నగరమే మా ప్రభుత్వ లక్ష్యం
- కాలుష్య రహిత నగరాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యం
- పారిశ్రామికవాడల్లోని భూముల వినియోగ మార్పిడిపై విచారణకు సర్కారు సిద్ధం
- శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- శాసనసభ నిరవధిక వాయిదా

**కాలుష్య రహిత హైదరాబాదే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో వాయు కాలుష్యం ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 263 నమోదైంది. వాహనాలతో 27% వాయుకాలుష్యం ఏర్పడుతుంటే, పరిశ్రమలతో 51% ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించడానికి 2012 నుంచే ప్రయ త్నాలు జరుగుతున్నాయి. మేం ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు చేపట్టామని తెలిపారు.**

హైదరాబాద్: 2014 నుంచి, ఇటీవల తమ ప్రభుత్వం తెచ్చిన హిల్ట్‌పీ తో పాటు ఇప్పటివరకు జరిగిన పారిశ్రామికవాడల్లోని భూముల వినియోగ మార్పిడిపై ఏ విచారణను ఆదేశించడానికైనా

-మిగతా 2 లో..




## కవిత రాజీనామాకు మండలి చైర్మన్ ఆమోదం

హైదరాబాద్: తన ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత చేసిన రాజీనామాకు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆమోదం తెలిపారు. నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన కవిత... గత ఏడాది సెప్టెంబర్ 3న తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తాజాగా రాజీనామాను ఆమోదించడంతో.. ఎమ్మెల్సీ స్థానానికి నోటిఫికేషన్ జారీ అయ్యింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేయడంతో ఆ పార్టీతోపాటు, తద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవికి ఆమె రాజీనామా చేశారు. తన రాజీనామాను

-మిగతా 2 లో..

## అమెరికాకు త్వరలో 600 బిలియన్ డాలర్ల ఆదాయం

డొనాల్డ్ ట్రంప్ 06



## హెచ్-1బీ వీసా ఫీజు పెంపు అంశం

విచారణ వేగవంతం



06


06

## టీవీకే అధినేత విజయ్‌కు సీబీఐ నోటీసులు

# నగరంలోపల ఉన్న పరిశ్రమలను అవతలికి తరలింపు



### నగరంలోపల ఉన్న పరిశ్రమలను అవతలికి తరలింపు

- నగరంలో పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండాలన్నదే లక్ష్యం
- పారిశ్రామిక ప్రాంతాలను నివాస యోగ్యంగా మారుస్తాం
- హిల్ట్‌పాలసీపై ప్రకటన చేస్తూ.. మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, జనవరి 6 : రేపటి తరాల భవిష్యత్ కోసం హిల్ట్‌పాలసీని తీసుకొస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హిల్ట్‌పాలసీపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. 'హిల్ట్‌పాలసీని సాదాసీదా భూమార్పిడిగా చూస్తున్నారు. దీనిపై సద్విమర్శలు

-మిగతా 2 లో..



## 10 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు

### తెలంగాణ ప్రభుత్వం ప్రకటన

హైదరాబాద్, జనవరి 6 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ప్రకటించింది. జనవరి 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అన్ని పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

-మిగతా 2 లో..

# ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

- కాలుష్య నివారణకు ఈవీ పాలసీ అమలు
- ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల పెంపునకు చర్యలు
- అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్, జనవరి 6 : ఈవీ వాహనాల బ్యాటరీల సామర్థ్యం పెంపునకు కంపెనీలు చర్యలు చేపట్టాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈవి పాలసీ కింద తయారీదారులు, డీలర్లతో భేటీ ఏర్పాటు

-మిగతా 2 లో..





## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 156 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 183 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 265 (కిలో) |
| స్కిన్ లెస్ | 302 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹82

# వరంగల్ కోట తెలంగాణ వారసత్వ సంపద

### కోట ఆక్రమణలను తొలగించాలి సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ



న్యూఢిల్లీ, జనవరి 6 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా వరంగల్ కోట భూములను భారత పురావస్తుశాఖకు చెందినవిగా గుర్తించాలని సూచించారు. కోట భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కోట భూముల్లోని ఆక్రమణదారులను తొలగించడం గురించి ఈ లేఖలో ప్రస్తావించారు.దాదాపు 250

-మిగతా 2 లో..

## శ్వాసకోశ సంబంధ సమస్యలతో ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ


04

**కాంగ్రెస్ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. సోనియాగాంధీ తీవ్రమైన దగ్గుతో బాధపడు తున్న నేపథ్యంలో ఆమెను వైద్యులు పర్యవేక్షణలో ఉంచారు.**



# టిక్కెట్ రేట్లు పెంచండి

### హైకోర్టును ఆశ్రయించిన చిత్ర నిర్మాతలు

హైదరాబాద్, జనవరి 6 : సంక్రాంతి కానుకగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాయి పలు తెలుగు చిత్రాలు. ముఖ్యంగా అగ్ర కథానాయకుడు ప్రభాస్ 'ది రాజాసాబ్', చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రాలు వరుసగా ఒకదాని తర్వాత ఒకటి విడుదల కానున్నాయి. భారీ బ్జడెట్‌తో రూపొందిన

-మిగతా 2 లో..

# మన పిల్లలకు మంచి భవిష్యత్ కోసం తపన

(మొదటిపేజీ తరువాయి)

చేస్తే స్వీకరిస్తాం. హిల్ట్ పాలసీ ద్వారా పారిశ్రామిక ప్రాంతం.. నివాస ప్రాంతంగా మారుతుంది. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు సీఎం యత్నిస్తున్నారు. నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలివైపునకు తరలిస్తాం అని అన్నారు. ఈ పాలసీ మేము కొత్తగా చేస్తున్నది కాదు. దీనికోసం విస్తృతంగా చర్చలు జరిగాయి. వనరులు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. హిల్ట్ పాలసీ గురించి తెలియకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. పారిశ్రామికవేత్తల భూములను.. ప్రభుత్వ భూములని ప్రచారం చేస్తున్నారు. జీవో ఎంఎస్ 19కు సంబంధించి లీజు భూములపై ప్రభుత్వానికి సర్వాధికారులు ఉంటాయని గత ప్రభుత్వం జీవో తెచ్చింది. స్వచ్ఛందంగా ముందుకు వస్తే భూములు కన్వర్ట్ చేస్తాం. నగరవాసులను కాలుష్యం నుంచి రక్షించాలన్నదే మా లక్ష్యం అన్నారు. మా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హేతుబద్ధత, శాస్త్రీయత ఉండాలని చూస్తున్నాం. భవిష్యత్ గురించి ఆలోచించే మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. మనం ఇన్ఫర్మేషన్ రెవల్యూషన్‌లో ఉన్నామని, అంతరిక్షంలో ఇళ్లు కట్టుకోబోతున్నామని గొప్పలు చెప్పుకుంటున్నాం కానీ, ఈ భూమిపై పుట్టిన జీవికి స్వచ్ఛమైన గాలి, నీరు అందించలేని అసమర్థ నాగరికతలో ఉన్నామనేది చేదు నిజం. అభివృద్ధి పేరిట జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని ఆపి, రాబోయే తరాలకు ఒక 'క్లీన్ ఎన్విరాన్ మెంట్'ను అందించడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం 'హిల్ట్' పాలసీకి శ్రీకారం చుట్టిందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. చాలా మంది హిల్ట్ పాలసీని కేవలం పారిశ్రామిక ప్రాంతాలను నివాస ప్రాంతాలుగా మార్చే ఒక సాదాసీదా 'ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్' పక్రియగా చూస్తున్నారు. కానీ ఇది కేవలం రెవెన్యూ రికార్డుల్లో మార్పు కాదు. 'పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలికి తరలించి, మన పిల్లలకు పీల్చేందుకు స్వచ్ఛమైన గాలిని, తాగేందుకు విషరహితమైన నీటిని అందించాలన్నదే మా సంకల్పం. ఇది రాబోయే తరాల కోసం మా ప్రభుత్వం వేస్తున్న ఆరోగ్యకరమైన పునాది అని మంత్రి వివరించారు. 1970వ దశకంలో హైదరాబాద్ పారిశ్రామిక ప్రస్థానం మొదలైంది. అప్పట్లో బాలానగర్, సనత్ నగర్, ఉప్పల్, జీడిమెట్ల వంటి ప్రాంతాలు నగరం వెలుపల ఉండేవి. కానీ నేడు..ఈ ప్రాంతాలు నగరం నడిబొడ్డున చేరాయి. ఫ్యాక్టరీ గోడ పక్కనే అపార్ట్‌మెంట్లు వెలిశాయి. పరిశ్రమల చిమ్నీల నుండి వచ్చే విషపూరిత పొగ నేరుగా బెడ్‌రూమ్‌ల్లోకి ప్రవేశిస్తోంది. నివాస గృహాలకు, పరిశ్రమలకు మధ్య ఉండాల్సిన 'బఫర్ జోన్' మాయమైపోయింది. మనం మన పిల్లల కోసం కోట్ల ఆస్తులు కూడబెట్టవచ్చు కానీ, వారు పీల్చే గాలి, తాగే నీరు విష తుల్యం అయితే ఆ ఆస్తుల వల్ల ఉపయోగం ఏంటని మంత్రి ప్రశ్నించారు. ఇది 'బిడ్డలకు బంగారు గిన్నెలో విషం ఇచ్చి తాగమన్నట్టు' ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి ఒక్కసారి నాశనమైతే తిరిగి రాదని, మనం ఈ భూమికి యజమానులం కాదని, కేవలం ధర్మకర్తలం మాత్రమేనని గుర్తుచేశారు. చరిత్రలో గొప్ప మార్పులన్నీ ఒకే అడుగుతో మొదలవుతాయని, అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసాన్ని ఆపడానికి ఆ మొదటి అడుగు తెలంగాణ నుండే ఎందుకు పడకూడదని మంత్రి శ్రీధర్ బాబు ఉద్ఘాటించారు. రాజకీయ విమర్శలు పట్టించుకోకుండా, నేల మనుగడ కోసం, పిల్లల ప్రాణాలను కాపాడటం కోసం ఈ చారిత్రక బాధ్యతను ప్రభుత్వం భుజానెత్తుకుందని ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమలను జనావాసాలకు దూరంగా తరలించడం ద్వారా హైదరాబాద్‌ను కేవలం కాంక్రీట్ వనంగా కాకుండా, ఒక నివాసయోగ్యమైన మహా నగరంగా మార్చడమే 'హిల్ట్' పాలసీ అంతిమ లక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు.

# టిక్కెట్ ధరలు పెంచుకునే అవకాశం ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఈ చిత్రాల టికెట్ ధరలు పెంచుకునేందుకు అవకాశం కల్పించాలంటూ ఇప్పటికే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరాయి. ఈ క్రమంలో రెండు చిత్రాల నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల అనుమతి కోసం అప్పీలు దాఖలు చేశారు. టికెట్ ధరలు పెంచకుండా గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేశారు. ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోలకు కోసం హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించేలా హోంశాఖ కార్యదర్శికి సూచించాలని కోరారు. అత్యవసర పిటిషన్ కింద విచారణకు స్వీకరించాలని నిర్మాతల తరపు న్యాయవాదులు కోరగా, అందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ పిటిషన్లపై బుధవారం విచారణ చేయనున్నట్లు తెలిపింది. మరోవైపు 'ది రాజాసాబ్' చిత్ర బృందం ఇప్పటికే టికెట్ ధరల పెంపు విషయమై హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకుంది. జనవరి 9న ఈ చిత్రం విడుదల కానుండగా, ఒకరోజు ముందుగానే అంటే జనవరి 8న రాత్రి స్పెషల్ ప్రీమియర్‌లను ఏర్పాటు చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణలో ఉదయం 4గంటల షోకు కూడా అనుమతి ఇవ్వాలని కోరింది. స్పెషల్ ప్రీమియర్ టికెట్ ధరను సింగిల్ స్క్రీన్‌లో రూ.800 (పన్నులతో కలిపి).. మల్టీప్లెక్స్‌లలో రూ.1000 (పన్నులతో కలిపి) పెంచుకునేలా అనుమతి ఇవ్వాలని కోరింది. జనవరి 9 నుంచి 11 వరకూ సింగిల్ స్క్రీన్‌లో రూ.105 (పన్నులతో కలిపి).. 12 నుంచి 18వ తేదీ వరకూ రూ.62 (పన్నులతో కలిపి).. మల్టీప్లెక్స్‌లో వరుస తేదీల్లో రూ.132, రూ.89 పెంచుకునేలా అనుమతి ఇవ్వాలని కోరింది. కోర్టు ఇచ్చే ఆదేశాలననుసరించి చిత్ర బృందాలు టికెట్ ధరల విషయంలో ముందుకు వెళ్లనున్నాయి.



# 10 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తున్నట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ సెలవులు ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య పాఠశాలలకు వర్తిస్తాయని పేర్కొంది. జనవరి 16వ తేదీన కనుమ రోజును పురస్కరించుకుని ఐచ్ఛిక సెలవు కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కనుమ రోజున రైతులు తమ పండుగను ప్రత్యేకంగా చేసుకుంటారు. కనుమ రోజున ఉత్సవాలు, పండుగ సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జనవరి 17వ తేదీ నుంచి అన్ని పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులను తమ ఇళ్లకు తీసుకురావడానికి తల్లిదండ్రులు ప్లాన్ చేసుకుంటున్నారు.

# కాలుష్య రహిత నగరమే మా ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)



ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క స్పష్టం చేశారు. ప్రతిపక్షలు అడ్డగోలుగా చేస్తున్న ఆరోపణలకు కట్టుబడి ఉంటే.. ఆ మేరకు లేఖ రాసిన మరుక్షణం ఏ విచారణ సంస్థతో కావాలంటే ఆ సంస్థతో విచారణ చేయించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మంగళవారం శాసనసభలో హైదరాబాద్ పారిశ్రామిక భూముల మార్పిడి (హిల్ట్) విధానం (పీ), తెలంగాణ రైజింగ్-2047పై లఘు చర్చ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలకు భట్టి జవాబిచ్చారు. 'ప్రతిపక్షం కడుపులో విషం పెట్టుకుని రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధిని పట్టించుకోకుండా తమ రాజకీయం కోసం రాజకీయాలు చేయడాన్ని మానుకోవాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం లీజు భూములను ఫ్రీహోల్డ్ చేసింది. తమకు కావాల్సిన వాళ్లకు పారిశ్రామిక భూములను వినియోగ మార్పిడి చేసింది. సిరీస్, గల్ఫ్ ఆయిల్ పరిశ్రమలకు భూ వినియోగ మార్పిడి చేసిన అంశాన్ని హిల్ట్ పాలసీతో పోల్చినప్పుడు రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.4,076 కోట్ల నష్టం వాటిల్లింది. హిల్ట్ పీ కింద కాంగ్రెస్ ప్రభుత్వం.. 80 అడుగుల లోపు రహదారి ఉన్న భూములకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ (ఎస్ఆర్వో) ధరలో 30 శాతం, 80 అడుగుల కంటే ఎక్కువ వెడల్పుతో రహదారి ఉన్నచోట ఎస్ఆర్వో ధరలో 50 శాతం చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. ఈ భూములపై ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదు. కేవలం భూ వినియోగ మార్పిడి చేస్తున్నందుకు ఈ ఫీజులు వసూలు చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న భూ వినియోగ మార్పిడి ధరల ప్రకారం అయితే కేవలం రూ.574 కోట్ల ఆదాయం మాత్రమే రాష్ట్రానికి లభిస్తుంది. అదే హిల్ట్ పీ కింద దాదాపు 4,780 ఎకరాల భూములకు భూ వినియోగ మార్పిడికి అవకాశం కల్పించడం ద్వారా దాదాపు రూ.10,776 కోట్ల ఆదాయం లభిస్తుంది..' అని డిప్యూటీ సీఎం తెలిపారు.

## హిల్ట్ పీ అత్యుత్తమం, పారదర్శకమైనది..

'హిల్ట్ పాలసీ రాగానే ప్రధాన ప్రతిపక్షనికి చెందిన ఓ నాయకుడు ప్రెస్‌మీట్ పెట్టి రాష్ట్రంలోని భూములన్నింటినీ అమ్మేస్తూ రూ.5 లక్షల కోట్ల స్కామ్‌కు తెరలేపారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలు విస్మరించి, బట్ట కాల్చి మీద వేసి తుడుచుకోమంటున్నారు. వారు రాష్ట్ర ప్రజా ప్రయోజనాల కంటే.. సొంత ప్రయోజనాల కోసం ఎక్కువగా పాకులాడుతున్నారు. హిల్ట్ పీ వల్ల రాష్ట్రానికి ఆదాయం లభిస్తుంటే.. గతంలో వారు చేసిన నిర్ణయాలతో భారీ నష్టం జరిగింది. గత ప్రభుత్వం అనుసరించి విధానాలతో పోలిస్తే హిల్ట్ పీ అత్యుత్తమమైనది. పారదర్శకమైనది. ఆదాయం సమకూరుతుంది. వారు ఆజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట పారిశ్రామిక వాడల్లో ప్రభుత్వ భూములు లీజులో ఉంటే..వాటిని వేలానికి పెట్టకుండా ఇష్టానుసారం ఇచ్చేశారు. ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పారిశ్రామికవేత్తలకు అప్పగించారు. వనరుల సమీకరణకు 2019లో అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో వేసిన కేబినెట్ సబ్ కమిటీకి సంబంధం లేకుండా కేటీఆర్ పరిశ్రమల మంత్రిగా జీవో ఇచ్చి పారిశ్రామిక భూములను ఐటీ పరిశ్రమలకు మార్చేలా ఉత్తర్వులు ఇచ్చారు. వారికి అనుకూల మైన వారికి భూ మార్పిడి చేశారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. మేము తెచ్చిన పాలసీలో దోపిడీకి ఆస్కారం లేదు..' అని భట్టి చెప్పారు.

# కేసీఆర్ చెప్ప ధూళికి కూడా సరితూగని రేవంత్

(మొదటిపేజీ తరువాయి)



ఆలోచనతోనే ఓటు వేసి ఆయనను గెలిపించుకుందామని పిలుపునిచ్చా రు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన ప్రతి ఒక్క సర్పంచి మున్సిపల్ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని కోరారు. వరంగల్ జిల్లాలో సర్పంచులు పెద్ద సంఖ్యలో గెలిచారని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడ్డా, ఒత్తిళ్లకు గురిచేసినా పార్టీ కోసం నిలబడ్డారని ప్రశంసించారు. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి ధన్యవాదాలు చెప్పారు. జనగామ ర్యాలీ చూస్తే 'కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు' అనిపించిందని అన్నారు. ప్రజలు గులాబీ జెండాను చూడగానే చప్పట్లు కొడుతుంటే సంతోషం అనిపించిందని, కాళోజీ మాటలు గుర్తొచ్చాయని అన్నారు. కేసీఆర్ ఎప్పుడు ముఖ్యమంత్రి అయితారా అని ప్రజలు కసితో ఎదురుచూస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ఏ పాత్ర లేకున్నా అన్ని పదవులు ఇచ్చిన పార్టీని వదిలి కడియం శ్రీహరి సీఎం రేవంత్ రెడ్డితో కలిశాడని విమర్శించారు. ఇక్కడి నిబద్ధత కలిగిన కార్యకర్తలు బీఆర్ఎస్ బలపర్చిన 150 మంది సర్పంచులను గెలిపించారని మెచ్చుకున్నారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, రాణి రుద్రమదేవి పుట్టిన గడ్డ ఇదని కేటీఆర్ కీర్తించారు. సీఎం రేవంత్‌రెడ్డిపైన, రాష్ట్ర ప్రభుత్వంపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి పాలన చేతగాక బీఆర్ఎస్ మీద నిందలు వేస్తున్నాడని ఆరోపించారు. ఏదో అడ్డిమారి గుడ్డిసూటిల సీఎం అయిన రేవంత్‌రెడ్డి.. మూడేళ్ల టైమ్-పాస్ చేసిపోక అవాకులు, చెవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి రైతులకు యూరియా ఇయ్య చేతగాదుగానీ.. అబద్దాలు అనర్గళంగా వస్తయని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్‌ను మల్ల మొలకెత్తనియ్యను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి శపథం చేయడంపైనా కేటీఆర్గ ÷రైయ్యారు. 'నువ్వేంది కేసీఆర్‌ను మొలకెత్తనియ్యకపోయేది' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. మీ కాంగ్రెస్ పార్టీ 60 ఏండ్లు తెలంగాణను తొక్కిప ట్టిందని, తెలంగాణను మొలకెత్తనివ్వమని విర్రవీగిందని, అసుంటి కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణను మొలిపించిన మొగోడు, మొనగాడు కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. రైతులకు యూరియా ఇవ్వడంలో రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. సరిపడా యూరియా అందక రైతులు గోస పడుతున్నరని ఆవేదన వెలిబుచ్చారు. 'రేవంత్ పాలనలో యూరియా షాప్‌ల లేదు, యాప్‌ల లేదు' అని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కొత్తగా కార్డు అంటూ కొత్త పాట అందుకున్నరని అన్నారు. 'రైతులకు యూరియా తెలివిలేక నాటకాలాడుతున్న దద్దమ్మలు ఈ కాంగ్రెసోళ్లు' అని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రైతులకు సరిపడా ఎరువులు అందాయని, ఎరువుల దుకాణాల ముందు రైతులు లైన్‌లలో నిలబడాల్సిన అవసరం రాలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టి రైతుల సమస్యలు తెలుసని, ఆయన రేవంత్‌రెడ్డిలా రియల్ ఎస్టేట్ బ్రోకర్ కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# కాలుష్య నివారణకు ఈవీ పాలసీ అమలు

(మొదటిపేజీ తరువాయి)

చేశామని అన్నారు. ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెంపునకు చర్యలు ఉంటాయన్నారు. మంగళవారం శాసనసభలో పొన్నం మాట్లాడుతూ.. ఈవీ వాహనాల రాయితీ అమలుతో రూ.900 కోట్ల పన్ను నష్టం అని.. ఉద్యోగులు ఈవి వాహనాలు కొనుగోలు చేస్తే 20 శాతం తగ్గింపు ఉంటుందని పొన్నం తెలియజేశారు. ఉద్యోగులకు 20 శాతం వరకు తగ్గించాలని కంపెనీలను కోరామని అన్నారు. ఎంఎన్ సి కంపెనీలు ఈవి వాహనాలు కొనుగోలు చేసేలా విధానం ఉంటుందని, పిఎం ఈ డ్రైవ్ కింద 575 ఆర్టిసి బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. కొత్తగా 200కు పైగా ఈవి బస్సులు వస్తున్నాయని, వరంగల్ లో 100, నిజామాబాద్ లో 50 బస్సులు వస్తున్నాయని పేర్కొన్నారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్క్రాప్ చేయాలని, స్క్రాప్ పాలసీ కింద ప్రోత్సాహం ఇచ్చేలా జివో తీసుకువచ్చామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఈవీ పాలసీని తీసుకువచ్చామని, ఈ ఏడాది కాలంలో లక్ష ఈవీ వాహనాలు అమ్ముడయ్యాయని వెల్లడించారు. కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్రం సబ్సిడీ ఇస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అలా ఇస్తోందా? అని ప్రశ్నించారు. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈవీలను తక్కువగా వినియోగిస్తున్నారు. రాష్ట్రం మొత్తంపై ఆ తరహా వాహనాలు 70 వేలే నడుస్తున్నాయి. కాలుష్యం తగ్గాలంటే ఈ సంఖ్య పెరగాలి. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలి. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మీద కేంద్రం సబ్సిడీ ఇస్తుంది.. తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల మీద సబ్సిడీ ఇస్తుందా? కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో 40శాతం మాత్రమే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఉందని తెలిపారు. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహనాలను వాడటం లేదని.. తెలంగాణలో 70 వేల ఎలక్ట్రిక్ వాహనాలే నడుస్తున్నాయని వెల్లడించారు. పొల్యూషన్ తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలి.. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ.. ప్రోత్సహించాలని కోరారు.



మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలని తెలిపారు. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని చెప్పారు. త్రీ వీలర్, ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రమోట్ చేయాలని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. 'హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ చేయాలంటే.. ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలి.. ఎలక్ట్రిక్, సోలార్ ప్యానెల్ తో నడిచే వాహనాలను ప్రోత్సహించాలి.. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలంటే పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలి.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.. ఇవీ పాలసీని తీసుకుని వస్తున్నందుకు ధన్యవాదాలు' అని ఎమ్మెల్యే వెల్లడించారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలంటే ఈవీలను వాడాలని చెప్పారు. వినియోగం పెరిగేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలని.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీ పాలసీ తీసుకొస్తున్నందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# కవిత రాజీనామాకు మండలి చైర్మన్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదించాలని రెండు మూడు సార్లు మీడియా ముఖంగా కవిత విజ్ఞప్తి చేసినప్పటికీ ఆమోదించలేదు. సోమవారం మండలిలో మాట్లాడుతూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తన రాజీనామాను ఆమోదించాలని మండలి చైర్మన్‌ను కోరగా.. భావోద్వేగాలతో తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలని ఆయన సూచించారు. అయినప్పటికీ.. తన రాజీనామాను ఆమోదించాలని సభాముఖంగా ఆమె మరోసారి విజ్ఞప్తి చేయడంతో తాజాగా ఆమోదించారు.



# వరంగల్ కోట భూ ఆక్రమణలు తొలగించండి

(మొదటిపేజీ తరువాయి)

సంవత్సరాలపాటు కాకతీయుల రాజధానిగా కీర్తిగడించి ఘనమైన చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక వైభవంతో అలరారిన ఓరుగల్లు పట్టణం.. తెలంగాణ వారసత్వ సంపదకు నిలయంగా విరాజిల్లుతోందని వ్యాఖ్యానించారు కిషన్‌రెడ్డి. కాకతీయుల కాలంలో ఇతర రాజ్యాల నుంచి ఎదురయ్యే దండయాత్రల నుంచి రాజధానికి రక్షణ కల్పించటం కోసం ఒక ప్రణాళిక ప్రకారం 7 ప్రాకారాలతో వరంగల్ కోటను ఎంతో పకడ్బందీగా నిర్మించారని పేర్కొన్నారు. ఢిల్లీ సుల్తానులు, హైదరాబాద్ నవాబుల దాడులను ఎదుర్కొన్న కోటని అభివర్ణించారు. నేటికీ కాకతీయుల శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రతిరోజూ వేలాదిమంది పర్యాటకులు ఈ కోటను సందర్శించి కోటలో దాగి ఉన్న శిల్ప సంపద, నిర్మాణ నైపుణ్యం, వందలాది ఆలయాలు, వాటి నేపథ్యం, కోట ప్రాధాన్యం గురించి తెలుసుకుంటున్నారని వెల్లడించారు కిషన్‌రెడ్డి. పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు కేందప్రభుత్వం ఇటీవలే సౌండ్, ఇల్యూమినేషన్ లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసిందని వివరించారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ం÷ూఎ) పర్యవేక్షణలో ఉన్న వరంగల్ కోట పరిరక్షణకు, నిర్మాణాల పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఈ వరంగల్ కోటకు చుట్టూ ఉన్న 7 ప్రాకారాల్లో ప్రస్తుతం 3 ప్రాకారాలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు కిషన్‌రెడ్డి. 3 ప్రాకారాలతో పాటు ఇతర ప్రాకారాలను కొంతమంది స్థానికులు ఆక్రమించి కోట భూముల్లో అనేక అక్రమ కట్టడాలు నిర్మించారని వెల్లడించారు. వరంగల్ కోట అధీనంలో ఉన్న ఒక స్మారక ప్రదేశమని, దీనికి సంబంధించిన భూములను ఆక్రమించడం, అందులో అక్రమంగా నిర్మాణాలను నిర్మించడం చట్టరీత్యానేరమని చెప్పుకొచ్చారు. వెంటనే ఆక్రమించిన భూములను ఖాళీ చేయాలని కోరుతూ ం÷ూఎ అధికారులు ఆక్రమణదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు కిషన్‌రెడ్డి. దే విషయాన్ని తెలియజేస్తూ తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అధికారులు 04.11.2022న అలాగే, ఇటీవల 01.12.2025న వరంగల్ జిల్లా కలెక్టర్‌కి పలుమార్లు లేఖలు రాశానని గుర్తుచేశారు. తాను లేఖ రాసిన కోట భూములను పరిరక్షించటానికి వరంగల్ జిల్లా కలెక్టర్ ఎటువంటి చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# 2047 నాటికల్లా
# 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

- అందుకు అనుగుణంగా పెట్టుబడులకు ప్రోత్సాహం
- మండలిలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**హైదరాబాద్, జనవరి 6 :** తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలనే దృఢమైన సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శాసన మండలిలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులకు సులువుగా ఉండే విధంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని తీసుకొచ్చా మన్నారు. తెలంగాణ రైజింగ్ సదస్సులో రూ.5లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చా యని తెలిపారు. ఈనెల 19న మరోసారి వరల్డ్ ఎకనమిక్ సమిట్‌కు వెళుతున్నామని, భారీగా పెట్టుబడులు తీసుకొస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. హ్యూసెంట్రియో, సిస్టా ఐటీ సంస్థల ద్వారా వెయ్యి చొప్పున ఉద్యోగాలు వస్తాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. జాబ్ క్యాలెండర్ విషయంలో సామాజిక అంశం పరిశీలిస్తున్నామని అన్నారు. ఉబెర్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని.. త్వరలో ఏర్పాటు చేస్తుందని, కాగ్నిజెంట్ సంస్థ ద్వారా 5 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలియజేశారు. పోచారం ఇన్ఫోసిస్ సంస్థ విస్తరణ ద్వారా 17 వేల మంది ఉపాధి, విప్రో సంస్థ విస్తరణ ద్వారా మరో 5 వేల మందికి ఉపాధి ఉంటుందని అన్నారు. 70 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కొనియాడారు. ఇప్పటికే 70 జిసిసిలు రాష్ట్రానికి వచ్చాయని.. సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లో ముందు కళ్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే జినోమ్ వ్యాలీ నాలుగో దశ కూడా పూర్తయిం దని, ఐటీ కంటే ఎక్కువగా ఫార్మా ఎగుమతులు జరుగుతున్నాయని అన్నారు. ఏరోస్పేస్, రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.



## అశాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటు

### అసెంబ్లీలో చర్చించి సరిచేస్తామన్న పొంగులేటి



**హైదరాబాద్, జనవరి 6 :** తెలంగాణలో గత ప్రభుత్వం జిల్లాలు, మండలాలను అశా స్త్రీయంగా, అసంబద్ధంగా రూపొందిం చిందని రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనిని సవరిం చాల్సి ఉందన్నారు. అసెంబ్లీలో ప్రశ్నోత్త రాల సమయంలో మంత్రి మాట్లాడు తూ.. మ్యాజిక్ ఫిగర్ కోసమే రాష్ట్రంలో మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టిందని విమర్శిం చారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమ యంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణను సరిచేస్తామని పొంగులేటి పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ తప్పుదాలతో ఒకే నియోజకవర్గంలోని నాలుగు మండలాలు.. నాలుగు జిల్లాల్లో ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించి అందరి ఆమోదంతో పునర్వ్యవస్థీకరణ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

## సింగరేణిలో త్వరలో క్యాథ్ ల్యాబ్

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, జనవరి 6 :** సింగరేణి కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభిస్తామని చెప్పారు. సింగరేణిపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 32మంది వైద్యుల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలో భర్తీ చేస్తాం. 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక పక్రియ జరుగుతోంది. సింగరేణి ఆస్పత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తాం. విశ్రాంత ఉద్యోగులు అక్కడ మందులు అందించేలా చర్యలు చేపడతాం అని భట్టి విక్రమార్క తెలిపారు.

## రాజన్న ఆలయ మాజీ ప్రధానర్చకులు మృతి

### తీవ్ర సంతాపం తెలిపిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

**వేములవాడ, జనవరి 6 :** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు శ్రీ అప్పాల భీమాశంకర్ మృతి చెందారు. ఆయన మరణంపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన సంతాపం తెలియజేశారు. రాజన్న ఆలయానికి భీమాశంకర్ చేసిన సేవలు మరువలేనివి కొనియాడారు. గతంలో తాను వేములవాడ రాజన్న ఆలయాన్ని సందర్శిం చినప్పుడు దగ్గరుండి పూజ కార్యక్రమాలు నిర్వహిం చారని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం రాజన్న భక్తులకు, వేములవాడ ప్రాంతానికి తీరనిలో టని అన్నారు. భీమాశంకర్ గారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



## యాప్ ఆధారిత డిపాజిట్లతో 850 కోట్ల మోసం

### ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్ అరెస్ట్

**హైదరాబాద్, జనవరి 6 :** ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్‌ను తెలంగాణ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ముంబయిలో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అమర్‌దీప్‌పై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి ఆయన ముంబయికి చేరుకోవడంతో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకొని తెలంగాణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. డిజిటల్ డిపాజిట్ల పేరిట అమర్‌దీప్ రూ.850 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. యాప్ ఆధారిత డిపాజిట్లతో ఫాల్కన్ సంస్థ భారీ కుంభకోణానికి తెరతీసింది. షేర్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ప్రజలను అమర్ మభ్యపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. స్కామ్ వెలుగులోకి రాగానే అమర్‌దీప్ దంపతులు దుబాయ్‌కి పారిపోయారు. ఈ కేసులో ఇప్పటికే సీఈవో, అమర్‌దీప్ సోదరుడిని అధికారులు అరెస్ట్ చేశారు. ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పేరిట భారీ పెట్టుబడి మోసానికి పాల్పడినట్లు సీఐడీ పోలీసులు తెలిపారు. నకిలీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా మోసాలు చేశారని.. ప్రముఖ ఎంఎన్‌సీల పేర్లతో ఫేక్ ఇన్‌వాయిస్ ఒప్పందాలు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. దాదాపు 7,056 మంది డిపాజిటర్లు.. అందులో 4,065 మంది బాధితులు ఉన్నారని తెలిపారు. తక్కువ కాలంలో ఎక్కువ పెట్టుబడి వచ్చేలా బాధితులను ఆకర్షించారన్నారు. ఇప్పటి వరకు 11 మంది నిందితులను అరెస్ట్ చేశామని.. వీరిలో డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, చార్టర్డ్ అకౌంటెంట్‌లు ఉన్నారని తెలిపారు. 12 ప్లాట్లు, 4 లగ్జరీ కార్లు, నగదు, బంగారం, షేర్లను సీజ్ చేసినట్లు వివరించారు.

## హైకోర్టును ఆశ్రయించిన రకుల్ సోదరుడు



**హైదరాబాద్, జనవరి 6 :** ప్రముఖ నటి సోదరుడు అమన్ ప్రీత్‌సింగ్ హైకోర్టును ఆశ్రయించాడు. మాసబ్ ట్యాంక్ పోలీసు స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని పిటిషన్ వేశాడు. డ్రగ్స్ కేసులో అమన్‌ప్రీత్‌పై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మాదకద్రవ్యాల విక్రేతల నుంచి డ్రగ్స్‌ను కొనుగోలు చేసినట్లు కేసు నమోదైంది. అప్పటి నుంచి అమన్ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశాడు. దీనిపై తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది.

## భర్తను హత్య చేసిన కేసులో ట్విస్ట్

- ఇన్సూరెన్స్ డబ్బులతో పాటు ప్రియుడిపై మోజు
- హత్య కేసులో పోలీసులు నిర్ధారణ



**నిజామాబాద్, జనవరి 6 :** భర్తను హత్య చేసి, గుండెపోటుగా చిత్రీకరించిన ఘటనలో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. భర్త పల్లటి రమేష్‌పై రూ.2 కోట్లకు పైగా ఇన్స్యూరెన్స్ ఉండగా.. బీమా డబ్బుల కోసమే భార్య సౌమ్య, ప్రియుడు దిలీప్ పక్క ప్లాన్ చేసినట్లు పోలీసులు తేల్చారు. వివాహేతర సంబంధానికి అడ్డు తొలగించుకోవటం ఆపై ఇన్స్యూరెన్స్ డబ్బులతో పారిపోవడానికి ప్లాన్ చేశారు. ఇన్స్యూరెన్స్ డబ్బుల కోసం నార్మల్ డెత్ గుండె పోటు అంటూ చిత్రీకరించారు. నిద్ర మాత్రలు ఇచ్చి భర్తగొంతు నులిమి హత్య చేసి హార్ట్ ఎటాక్‌గా భార్య నమ్మించింది. మృతుడి తమ్ముడి ఫిర్యాదుతో మృతదేహానికి రీపోస్టు మార్టం నిర్వహించారు. పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విచారణలో తామే హత్య చేసినట్లు భార్య సౌమ్య, ప్రియుడు దిలీప్ ఒప్పుకున్నారు. పోలీసుల వెల్లడించిన వివరాలు ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం బొర్గాం గ్రామానికి చెందిన పట్టాటి రమేష్ భార్య సౌమ్య ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తోంది. అదే పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న దిలీప్‌తో ఆమెకు పరిచయం.. వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం భర్త రమేష్‌కు తెలియడంతో, ఇద్దరినీ గట్టిగా మందలించాడు. దీంతో భర్త అడ్డు తొలగించుకోవాలని సౌమ్య ప్రియుడితో కలిసి ప్లాన్ చేసింది. గత నెల 20న సౌమ్య తన ప్రియుడు దిలీప్‌తో కలిసి రమేష్‌ను ఇంట్లోనే హత్య చేశారు. అనంతరం భర్త గుండెపోటుతో మృతి చెందినట్లు నమ్మించి, ఎవరికీ అనుమానం రాకుండా హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, అంత్యక్రియల సమయంలో రమేష్ మెడపై గాట్లు కనిపించడంతో స్థానికులకు అనుమానం కలిగింది. వెంటనే ఇజ్రాయెల్‌లో ఉన్న అతని తమ్ముడు కేదారికి సమాచారం అందించడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి విచారణ చేపట్టగా అసలు నిజం బయటపడింది. ఈ కేసులో సౌమ్యతో పాటు మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## కేసీఆర్‌ను కాదు.. రాహుల్‌ను ఉరితీయాలి

- అది గౌరవ సభ కాదు.. కౌరవ సభ
- అసెంబ్లీ తీరుపై మండిపడ్డ కేటీఆర్



**జనగామ, జనవరి 6 :** తెలంగాణ అసెంబ్లీ నడుస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాట్ కామెంట్స్ చేశారు. అసెంబ్లీ గౌరవ సభ కాదని.. కౌరవ సభ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శాసనసభ బూతుల సభగా మారిందని మండిపడ్డారు. మంగళవారం నాడు జనగామలో పర్యటించిన కేటీఆర్.. రాహుల్ గాంధీ లీడర్ కాదని.. రీడర్ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. వరంగల్‌లో రైతులకు ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను మరిచిన రాహుల్ గాంధీని ఉరితీయాలని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. 'కుటుంబం అన్నాక గొడవలు ఉంటాయని.. అలుగుడు గులుగుడు ఉంటది, సర్దుకుపోవాలన్నారు. లేదంటే.. కాంగ్రెస్ వాళ్లకు సందు దొరుకుతది' అని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి నిస్సిగ్గుగా ఇచ్చిన హామీలన్నింటినీ మర్చిపోయారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్‌ను ఉరి తీయాలని రేవంత్ రెడ్డి అన్న కామెంట్స్‌ని ప్రస్తావించిన కేటీఆర్.. చావునోట్లో తలపెట్టి తెలంగాణను తెచ్చినందుకు కేసీఆర్‌ను ఉరి తీయాలా? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో రైతుల అవస్థలను కూడా కేటీఆర్ ప్రస్తావించారు. యాప్‌లో యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటూ ఘాటైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు.



## ఏసీబీకి చిక్కిన లంచావతారుడు

### 50 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తాసిల్దార్

**కామారెడ్డి, జనవరి 6 :** కామారెడ్డి జిల్లాలో తహసీల్దార్ ఏసీబీ వలలో చిక్కాడు. రూ. 50 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నాగిరెడ్డిపేట మండల తహసీల్దార్గా పనిచేస్తున్న యార్లగడ్డ శ్రీనివాస్ రావుతో పాటు లంచం తీసుకోవడంతో మధ్యవర్తిగా వహించిన ప్రైవేట్ వ్యక్తి చినూరు అజయ్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. మండలానికి చెందిన ఓ వ్యక్తి తన తండ్రి పేరుపై ఉన్న వ్యవసాయ భూమిని తన పేరు మీద బదిలీ చేయాలని కోరగా అందుకు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ నేతృత్వంలో సిబ్బంది కార్యాలయంపై మాటు వేసి తహసీల్దార్ లంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిని నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## హిల్ట్ పాలసీలో లోపాలు సవరించాలి

- పరిశ్రమలను మూసేసేలా ప్రభుత్వ విధానాలు
- బిజెపి శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, జనవరి 6 :** హిల్ట్ పాలసీకి సంబంధించి సబ్ కమిటీ నిర్ణయాల ను ఎందుకు బయట పెట్టలేదని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. జీవో 27 చాలా వివాదాస్పదంగా ఉందని అన్నారు. హిల్ట్ పాలసీపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. జీవో లీక్ కావడంపై ప్రభుత్వంలో ఆందోళన ఉంది. టౌన్‌షిప్‌లు, అపార్ట్‌మెంట్‌లు ఉండాలని జీవో 27లో ఉంది. అతితక్కువ ధరకు భూములు ఇచ్చారు. 22 పారిశ్రామికవాడలను అన్యాక్రాంతం చేస్తున్నారు. ఫార్మాసిటీ కోసం రైతుల నుంచి సేకరించిన భూములను ఫోర్త్ సిటీకి ఉపయోగిస్తున్నారు. ఆ భూములపై హైకోర్టు అఫిడవిట్ అడిగింది. పరిశ్రమలను మూసివేసేలా ప్రస్తుత పాలసీ ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేసే అధికారం ప్రస్తుత ప్రభుత్వానికి ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలో తప్పులు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగానీ పరిశ్రమల భూములను రియల్ ఎస్టేట్ భూములుగా మార్చాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. ఇది సరికాదన్నారు. భారత రాష్ట్ర సమితికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 43,342 జీవోలు దాచి పెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం 19,064 జీవోలు ఇస్తే.. 3,290 జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయని ఆరోపించారు.

## ర్యాంకులే చదువుకు కొలమానం కాదు

- పిల్లలపై ఒత్తిడి చేస్తే దుష్ప్రభావం
- విద్యార్థి ఆత్మహత్య నేపథ్యంలో పోలీసుల సూచన

**హైదరాబాద్, జనవరి 6 :** ఇటీవల బడికి వెళ్లేందుకు సిద్ధం కావాలని తల్లిదండ్రులు చెప్పడంతో అందుకు ఇష్టంలేని బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో జరిగింది. అయితే తల్లిదండ్రులు పిల్లపై ఒత్తిడి పెంచరాదని సైబరాబాద్ పోలీసులు సూచించారు. ఇది తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. చదువుల ఒత్తిడితో ఇక జీవితంలో ఏమీ లేదననే రీతిలో విద్యార్థులు తమకు తాముగా మరణ శాసనం రాసుకుంటున్నారు. జీవితంలో పరీక్షలు అనేవి ఒక భాగం మాత్రమే అని.. పరీక్షలే జీవితం కాదు. కేవలం చదువే జీవితం కాదు. చదువు లేకున్నా విషయజ్ఞానాన్ని, హార్డ్ వర్క్, ప్యాషన్‌ను నమ్మి ఎంతో మంది జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి.. చెప్పులు కుడుతూ వీధి దీపాల కింద చదివి అబ్రహాం లింకన్ అమెరికన్ ప్రెసిడెంట్ అయ్యారు. జీవితంలో పెద్దగా చదువు లేనప్పటికీ పట్టుదల, కృషి ఉంటే గొప్పవారు కావచ్చని శ్రీనివాస రామానుజన్, రజనీకాంత్, నవాజుద్దీన్ సిద్దికీ, మార్క్ ట్వెయిన్, స్టీవ్ జాబ్స్, షేక్ స్పియర్, మైఖేల్ ఫారడే, గ్రిగర్ మెండల్, విన్ స్టన్ చర్చిల్, అబ్రహాం లింకన్, ఆల్బర్ట్ ఐన్ స్టీన్ తదితరులు నిరూపించారు. ర్యాంకులు, మార్కులు, తోటి విద్యార్థులతో పోలికలు.. ఇవన్నీ కలగలిపి విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. బతకడం కోసం, విజ్ఞానం కోసం నేర్చుకోవాల్సిన చదువులు.. యువతను మానసిక ఒత్తిడికి గురిచేసి వారిని ఆత్మహత్యల వైపు నడిపిస్తుండడం బాధాకరం. ర్యాంకుల కోసం నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. దేశమంతటా వెలుగుచూస్తున్న విద్యార్థుల బలవన్మరణాలు సామాజిక రుగ్మతగా పరిణమిస్తున్నాయి. చదువు మనిషిని సంస్కరించాలి.. చదువు జీవన వికాసానికి ఉపయోగపడాలి కానీ జీవన వినాశనానికి కాదు. అధైర్యపడొద్దు, క్రుంగిపోవద్దు. ఆత్మన్యూనత భావానికి లోనూ కావద్దు. అపజయం నుంచి నేర్చుకొని బౌన్స్ బ్యాక్ కావాలి. వైఫల్యాలే రేపటి విజయానికి బంగారు బాటలు). మళ్లీ మళ్లీ ప్రయత్నించి తాము అనుకున్న లక్ష్యాలను సాధించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకువెళ్లాలి. భవిష్యత్తు గురించి ప్రణాళికలు రచించుకోవాలి. మనం ఎంచుకున్న రంగంలో ఎదివరకే విజయం సాధించిన వారి సూచనలు తీసుకోవాలి.

## తీవ్రమవుతున్న కుక్కల బెడద

### భైంసాలో ఒక్కరోజే 50 మందిపై దాడి



**నిర్మల్, జనవరి 6 :** కుక్కల స్వైర విహారంతో జనం బెంబేలెత్తి పోతున్నారు. అవి దాడి చేసినప్పుడు హడావిడి చేస్తున్న అధికారులు తరవాత మరిచి పోతున్నారు. గ్రామం నుంచి పట్టణం వరకు కుక్కల బెడద తీవ్రం అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తాజా నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఓ పిచ్చి కుక్క బీభత్సం సృష్టించింది. సోమవారం ఒక్కరోజే 50మందిపై దాడిచేసి గాయపరిచింది. ఈ పిచ్చికుక్క దాడిలో నలుగురు చిన్నారులు, 20 మంది మహిళలు, 26 మంది పురుషులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భైంసా ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్క కాటు బాధితులు భారీగా చేరారు. ఆస్పత్రి వైద్యులు తక్షణం మెడికల్ సహాయం అందిస్తున్నారు. పిచ్చి కుక్కలను పట్టుకోవడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి సరైన పరిష్కారం రాలేదని ఆవేదన చెందుతున్నారు. శునకాల దాడులతో తీవ్ర భయాందోళన చెందుతున్నామని వాపోయారు. తమ ప్రాణాలను కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. పిచ్చి కుక్కల దాడులపై ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. శునకాల దాడులు ప్రతిరోజూ పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. అధికారులు సకాలంలో స్పందించకపోతే తీవ్ర ఆందోళనలు చేపడతామని ప్రజలు హెచ్చరించారు. అధికారులు త్వరగా పిచ్చి కుక్కలను పట్టుకోవాలని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# రాజకీయ అవినీతికి శిక్ష ఏదీ?



**రాజకీయ అవినీతికి శిక్షలు లేకుండా పోయాయి. విచారణలు ఏళ్లకు ఏళ్లు సాగుతుంటాయి. ఆధారాలు ఉండవు. ఉన్నా వాటిని మాయం చేస్తారు. భారతదేశంలో రాజకీయ అవినీతి కారణంగా రాజకీయ పార్టీలు ఆడిందే ఆటగా సాగుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే విభజన తరవాత ఉమ్మడి ఎపి నష్టపోయినంతగా గతంలో ఏ రాష్ట్రం కూడా నష్టపోలేదు. ఈ విభజన కేవలం కెసిఆర్ కుటుంబాన్ని, జగన్ కుటుంబాన్ని మాత్రమే కోటీశ్వరులను చేసింది. విభజనతో తెలంగాణ దగాపడ్డదన్నది ముమ్మాటికీ నిజం. ఉద్యమకారుల ముసుగులో నాటి పాలకులు వ్యూహాత్మకంగా ప్రజలను నమ్మించి మోసం చేశారు. ఈ క్రమంలో అప్పులు చేసి రెండు రాష్ట్రాలను అప్పల ఊబిలోకి నెట్టారు. బంగారు తెలంగాణ, ధనిక తెలంగాణ అంటూ కెసిఆర్ తడిబట్టతో గొంతు కోశారు. వీరి నేరాలను రుజువు చేసేదెవరు? ఎందుకంటే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో రెండేళ్లయినా కెసిఆర్ అవినీతిపై విచారణ జరగడం లేదు. ఏ కేసులోనూ అవినీతిని రుజువు చేసే చర్యలు చేపట్టలేదు. అలాగే చంద్రబాబు నాయుడు కూడా జగన్ అవినీతి వ్యవహారాలపై మాట్లాడడం లేదు. విచారణలు జరగడం లేదు. జగన్‌ను తిట్టిపోయ డమే తప్ప చేసిదేమీ లేదు. దీనిని బట్టి రాజకీయ పార్టీలు అవగాహనతో ఉంటున్నాయన్న అనుమానం ప్రజల్లో ఉంది.**

అయితే తాజాగా కవిత తన సొంత కుటుంబం పైనా, బిఆర్ఎస్ వ్యవహారాల పైనా చేసిన ఆరోపణలు పరిశీలిస్తే.. గత పదేళ్లుగా ప్రజలు ఇవే అంశాలపై చర్చించారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఎంతగా నష్టపోయామో కుమిలిపోయారు. అందుకే కెసిఆర్‌ను ఓడించి సంబుర పడ్డారు. అయితే ఇప్పుడ చెబుతున్న విషయాలపై ఆనాడు కవిత వేటికీ స్పందించలేదు. లక్షల కోట్లకు కెసిఆర్ కుటుంబం, ఆయన అనుచరులు, ఆనాటి మంత్రులు, ఇలా అంతా పడగలెత్తారు. కానీఒక్కటంటే ఒక్కటి కూడా బయటకు రాలేదు. ఓ ఉద్యోగి వేయి రూపాయలు లంచం తీసుకుంటే పట్టుకుంటున్న పోలీసులు కూడా వారిని పట్టుకునే ప్రయత్నం చేయడం లేదు. దీనిపై కేంద్రం కూడా నాలుగు రాళ్ల వేసి ఊరుకుంటుందే తప్ప పట్టించుకోవడం లేదు. ఇలా ఏళ్లుగా అవినీతి కేసుల నుంచి రాజకీయ పార్టీల నేతలు సమర్థంగా తప్పించు కుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కేసే ఇందుకు పెద్ద ఉదాహరణ. తాజాగా కెసిఆర్ తనయ కవిత ఇప్పుడు సంచలన ఆరోపణలు చేశారు. ఎంతగా అవినీతి జరిగిందో తెలియచేశారు. తండ్రి, బావ అన్నలతో పాటు ఆనాటి మంత్రులు ఎవరెవరు ఎంతగా మేశారో చెప్పారు. వీటి ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు కూడా స్పందించి, చర్యలకు డిమాండ్ చేశారు. ఇప్పుడు నిజాయితీ నిరూపించుకోవాల్సిన బాధయత సిఎం రేవంత్‌పై ఉంది. అవినీతి పట్ల ఆచన వైఖరి ఏంటన్నది తెలియాలి. తెలంగాణ వచ్చాక మంచి జరుగుతుందని ప్రజలకు ఆశ ఉండేదని, కానీ, వారి ఆశలన్నింటినీ పదేళ్ల కాలంలో అడియాసలు చేశారని కవిత స్వయంగా ప్రకటించారు.

ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వలేదు సరికదా.. తెలంగాణ కోసం పోరాడిన లక్షలాదిమంది ఉద్యమకారులకు గౌరవం కూడా దక్కలేదు. చివరికి, అమర వీరుల స్మారక స్తూపం, అంబేద్కర్ విగ్రహం నిర్మాణంలోనూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తరవాత ఆమె తరచూ అవినీతిపై ఆరోపణలు చేస్తూ వచ్చారు. తనది ఆత్మగౌరవ పోరాటమని, ఆస్తుల పంచాయితీ కాదని అంటోంది. అయితే ఆస్తుల పంచాయితీ అని ఇప్పుడు స్పష్టంగా తేలిపోయింది. ఎందుకంటే లక్షల కోట్ల అవినీతి సొమ్మును దాచుకుని తనకు వాటా ఇవ్వలేన్న బాధతోనే ఆమె బయటకు వచ్చారు. లేదా ఆస్తి అడిగతే గెంటివుంటారు. ఈ రెంటిలో ఏదో ఒకటి అయివుంటుంది. అందుకే ఆమె బాధను మింగలేక తన తండ్రి కేసీఆర్‌పైనా, ఆయన పాలనపైనా తీవ్ర ఆరోపణలు చేశారు. కొద్ది రోజులుగా తనలో దాచుకున్న ఆక్రోశాన్ని వెళ్లగక్కుతూ భావోద్వేగానికి గురయ్యారు. కొత్తగా వచ్చినవాళ్లు, ఉద్యమంతో సంబంధం లేని వాళ్లు సైతం తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర ఏమిటని ప్రశ్నిస్తున్నారని, అందుకే ఈ విషయాలు చెబుతున్నానని కవిత వ్యాఖ్యానించారు. ఇక కాళేశ్వరం కెసిఆర్ ఎటిఎంగా మారిందని స్వయంగా ప్రధాని మోడీ, అమిత్ షాలు పదేపదే ఆరోపించారు పదేళ్లలో రూ.1.89 లక్షల కోట్లు ఖర్చు చేసి 14 లక్షల ఎకరాలకే నీళ్లు ఇచ్చారని, అవే డబ్బులతో 25 లక్షలమంది పేదలకు ఇళ్లు ఇవ్వవచ్చునని తాజాగా కవిత కూడా వ్యాఖ్యానించారు. ఉద్యమకారుల సమస్యలు కేసీఆర్‌కు చేరకుండా అడ్డుగోడ కట్టారని విమర్శించిన కవిత ఆనాడు తానూ ఓ సిఎం కూతురుగా, ఎంపిగా ఉన్నానన్న విషయం మరచి పోయారు. ఈ విషయాలన్నీ ఆనాడే అంతర్గతంగా అయినా లేవనెత్తి ఉంటే వాటికి విలువ ఉండేది. తెలంగాణలో అవినీతి లేని పారదర్శక విధానాన్ని చూడాలనుకున్నామని, కానీ జరగలేదని కవిత వ్యాఖ్యానించారు. అంటే కెసిఆర్ అవినీతి పాలన నిజమే అని కవత చెప్పేశారు. పారదర్శకత అన్నది ముసుగు అన్నది కూడా తేలిపోయింది. పార్టీలో, ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని కవిత వెల్లడించారు. కొంతమంది ప్రజా ప్రతినిధులు చేస్తున్న అవినీతిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు లేవని వివరించారు.

అమరజ్యోతి, సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, కలెక్టరేట్ల నిర్మాణంలో అవినీతి జరిగింది. సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి. 1969 ఉద్యమకారులనూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాల ట్యాగ్‌లైన్‌కు గండికొట్టేశారు. ఇసుక దందాల కారణంగా నేరెళ్ల లాంటి దురాగతాలు జరిగాయని, అయినా అప్పట్లో చర్యలు తీసుకోలేదని తెలిపారు. తెలంగాణ వచ్చాక కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయకపోగా పెంచి పోషించారని తప్పుబట్టారు. ధర్నా చౌక్‌ను తీసేయాలని నిర్ణయించినప్పుడు తాను వ్యతిరేకించానని, తెలంగాణ వచ్చాక ధర్నా చౌక్ ఎందుకని.. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని కేసీఆర్ చెప్పారని, కానీ, అవేవీ అమలు కాలేదని తప్పుబట్టారు. మొత్తంగా కవిత తను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉండాలి. తన వద్ద ఉన్న ఆధారాలను ప్రభుత్వానికి లేదా విచారణకు సమర్పించాలి. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై గళమెత్తాలి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే బాధలు పోతాయన్న వాదనలు తప్పని తేలింది. ఆంధ్రావాళ్లను అన్యాయంగా నిందించిన తెలంగాణ ఉద్యమకారులు ఇప్పుడు కళ్లు తెరవాలి. అసలు ద్రోహులు తెలంగాణ వారే అని గుర్తించి మరో ఉద్యమానికి సిద్ధం కావాలి.

# సోయా కొనుగోళ్లపై ఆందోళన

- బిఆర్ఎస్ పిలుపుతో జిల్లా బంద్
- స్వచ్ఛందంగా వాణిజ్య సంస్థల మద్దతు
- మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అరెస్ట్



**ఆదిలాబాద్, జనవరి 6 :** ప్రభుత్వం వెంటనే సోయా కొనుగోళ్ల చేపట్టాలని మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బంద్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. దీంతో పట్టణంల వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పట్టణంలో బిఆర్ఎస్ బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ క్రమంలో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించడానికి మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జోగు రామన్న ఆధ్వర్యంలో ఈ బంద్ నిర్వహించారు. సోయా కొనుగోలులో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధరలు, సరైన రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈక్రమంలో ఆర్టీసీ డిపో వద్ద పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. జోగు రామన్నతో సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. జోగు రామన్న ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోయా కొనుగోలుపై బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చారు. గత కొంత కాలంగా సోయా రైతులు పడుతున్న ఇబ్బందులపై పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా సోయా కొనుగోలులో గిట్టుబాటు ధరలపై సరైన ఆధారిత విధానాలు లేకపోవడంపై పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే బంద్‌కి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో బస్సుల రాకపోకలను నేతలు అడ్డుకున్నారు. ఆర్టీసీ డిపో వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న జోగు రామన్నతో సహా పలువురు నేతలను అరెస్టు చేశారు. జోగురామన్న తమ పోరాటాన్ని విస్తృతం చేయడంలో భాగంగా ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. అన్నదాతలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుత విధానాలకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. రైతన్నల సమస్యలను గుర్తించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలపై తాము పోరాడుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమె త్తారు. రైతులు సరైన గిట్టుబాటు ధరలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలకు న్యాయం చేసేవరకు తాము పోరాడుతామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమం పెద్దఎత్తున జరుగుతున్న సమ యంలో పోలీసులు భారీ బలగాలతో ఆర్టీసీ డిపో వద్దకు చేరుకు న్నారు. ప్రజల మౌలిక హక్కులపై అడ్డగోలుగా ఇబ్బందులు కలిగించకుండా జాగ్రత్త తీసుకోవాలని వారిని హెచ్చరించారు. అయితే, ఆందోళన చేస్తున్న జోగు రామన్నతో సహా మరికొంత మంది నేతలను అరెస్టు చేశారు. ఈ ఘటనతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనల నేపథ్యంలో జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసు లు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, గులాబీ శ్రేణులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహ రించడం సరికాదని మండిపడ్డారు. తాము శాంతియుతం గా ధర్నా చేస్తుంటే పోలీసులు ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏపీ ట్రాప్‌లో కాంగ్రెస్ పడిపోతోంది

- మా హయాంలోనే 90శాతం పనులు పూర్తి
- పదిశాతం పనులు పూర్తి చేస్తే నీళ్లు వాడుకోవచ్చు
- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై బిఆర్ఎస్
- కొత్త ప్రాజెక్టు కడితే ఎప్పటికి పూర్తవుతుందో ?
- రిజర్వాయర్లను సందర్శించిన బిఆర్ఎస్ నేతలు
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**మహబూబ్‌నగర్, జనవరి 6 :** పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 10 శాతం పనులను పూర్తిచేస్తే నీళ్లను వాడుకోవచ్చని మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టు కడితే ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. ఏపీ ట్రాప్‌లో కాంగ్రెస్ నేతలు పడిపోవద్దన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు 90 శాతం పూర్తయ్యాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. రూ.32 వేల కోట్ల పనులు బీఆర్ఎస్ పూర్తి చేసిందని తెలిపారు. రూ.27 వేల కోట్ల బిల్లులు చెల్లించామని పేర్కొన్నారు. కేసీఆర్ వచ్చాక తెలంగాణ నీటి లభ్యత గురించి తెలియజేశారని అన్నారు. ముందే అప్రమత్తమైతే తెలంగాణ నీటి వాటాను కోల్పోయేది కాదని అభిప్రాయపడ్డారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వ్టటెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. జూరాలకు సరాసరి 25 రోజులు వరద వస్తుందని అన్నారు. జూరాల ప్రాజెక్టు కడితే తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. 3 లక్షల పైచిలుకు జనం ముంపునకు గురవుతారని పేర్కొన్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయి అన్ని రిజర్వాయర్లను నింపితే 68 టీఎంసీల నీళ్లు వస్తాయని తెలిపారు. అవసరమైతే మళ్లీ నీళ్లను నింపుకోవచ్చని అన్నారు. దీనివల్ల ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. తెలంగాణ నీళ్లను వాడుకుంటే ఇబ్బందని జూరాల ప్రాజెక్టు తీసుకొచ్చారని మండిపడ్డారు. జూరాల ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులు 40 ఏళ్ల నుంచి ప్రజలకు చూపిస్తున్నారని నిరంజన్ రెడ్డి తెలిపారు. జూరాల నుంచి నీళ్లు తీసుకోవడం అంటే పాలమూరుకు నీళ్లు వద్దని చెప్పడమే అని స్పష్టం చేశారు. ఇంత చేసినా జూరాల వద్ద నీళు ఉండవని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచిని తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఏం కోల్పోయామో అర్థమైతే ఎప్పటికీ మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. చరిత్రలో కాంగ్రెస్‌కు స్థానమే ఉండదని.. ఎప్పటికైనా చరిత్రలో నిలిచేది కేసీఆరే అని స్పష్టం చేశారు. దొంగ మాటలు, మోసాలతో ప్రజలను ముంచాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి జీవో 24ను ఒకసారి చదువుకోవాలని సూచించారు. 90 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టును ఆపడమేంటని ఆయన ప్రశ్నించారు. తట్టెడు మట్టి తీయకుండానే బీఆర్ఎస్ ప్రభుత్వంపై అబద్దాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అనేక కేసులు వేసి ఏపీ ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకులు సహకరించారని ఆరోపించారు. జూరాల నుంచి పాలమూరుకు నీళ్లు అంటేనే పెద్ద కుట్ర అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. తప్పుల తడకగా ఉత్తమ్ కుమార్ రెడ్డి పీపీటీ ఇచ్చారని విమర్శించారు. హరీశ్‌రావు పవర్‌ఫుల్ ప్రజెంటేషన్‌తో ఉత్తమ్‌కు పీపీటీతో సమాధానమిచ్చారని తెలిపారు. ప్రజలకు అన్ని విషయాలపై సంపూర్ణ అవగాహన ఉందని అన్నారు. కృష్ణా నది నీళ్లను తెలంగాణకు దక్కకుండా చేసేందుకే కుట్రలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.అప్పుడైనా.. ఇప్పుడైనా కృష్ణా నీళ్లు పాలమూరుకు రాకుండా చేస్తున్నారని అన్నారు. నిజాం కాలంలోనే కృష్ణా నీటి కోసం అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని తెలిపారు. తుంగభద్రలో నీటి పంపకాలపై 65 టీఎంసీల కోసం 1944లోనే ఒప్పందాలు జరిగాయని అన్నారు. భీమా ప్రాజెక్టును యాదగిరి జిల్లాలో మొదట ప్రతిపాదించారని, ఆలమట్టిని కూడా నిజాం కాలంలోనే ప్రతిపాదించారని తెలిపారు. పాలమూరుకు 174 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని నిజాం పలు ప్రాజెక్టులను నిర్మించారని పేర్కొన్నారు. కానీ నిజాం కాలంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులను నెహ్రూ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తుచేశారు. అప్పటి నుంచే తెలంగాణకు అన్యాయం చేయడం ప్రారంభమైందని తెలిపారు. సిద్దేశ్వరం దగ్గర కట్టాల్సిన శ్రీశైలం ప్రాజెక్టును 86 కిలోమీటర్ల కింద కట్టారని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. సిద్దేశ్వరం దగ్గర ఆ ప్రాజెక్టు కట్టి ఉంటే గ్రావిటీ ద్వారా పాలమూరుకు నీళు వచ్చేవని పేర్కొన్నారు. జల విద్యుత్ కోసం కట్టిన శ్రీశైలం నుంచి తెలుగుగంగ పేరుతో నీటిని తరలించారని అన్నారు. తెలుగుగంగ ద్వారా కడప, నెల్లూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించారని పేర్కొన్నారు. కృష్ణా నదిని మొత్తం మలుపుకు పోయేలా పోతిరెడ్డిపాడును చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం దరిదాపుల్లోకి రాకుండా చేసే కుట్ర అప్పుడు జరిగిందని.. ఇప్పుడు కూడా జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ లేవనెత్తిన అంశం అసాధ్యమని తెలిపారు.

## క్రాప్ హాలీడే ఇచ్చిన ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోస్తారా?

- జూరాల నుంచి నీళ్లు ఎత్తిపోయడం అసాధ్యం
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్, జనవరి 6 :** జూరాల నుంచి పాలమూరు లిఫ్ట్ పెడితే ఒక్క చుక్క నీరు కూడా రాదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఎన్ని రోజులు పంపింగ్ చేసినా లాభం ఉండదని అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాను ఎడారిగా మార్చే ఆలోచనలు చేస్తున్నారని అన్నారు. దీనిపై ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎందుకు ఈ ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడలేదని ప్రశ్నించారు. యాసంగిలో జూరాల ప్రాజెక్టు కింద ఆయకట్టుకు క్రాప్ హాలీ డే ఇచ్చారని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గుర్తుచేశారు. క్రాప్ హాలీడే ఇచ్చిన ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోస్తారా అని ప్రశ్నించారు. జూరాల నుంచి నీళ్లు ఎత్తిపోయడం అసాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు మళ్లీ తొండి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు అజ్ఞానంతో మాట్లాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. బూత్‌పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎలా ఎత్తిపోస్తారని ప్రశ్నించారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ లిఫ్ట్‌తో ప్రజాధనం కచ్చితంగా వృథా అవుతుందని అన్నారు. కేసీఆర్ గొప్పగా ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. దాన్ని పడావు పెట్టారని మండిపడ్డారు. కాల్వలకు టెండర్లు పిలిచి పూర్తి చేస్తే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు నీళ్లు వస్తాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అవగాహన లేకుంటే నిపుణులతో మాట్లాడి తెలుసుకోవాలని సూచించారు. మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చి కమీషన్లు దండుకున్న ఘనత కాంగ్రెస్ పాలకులదే అని లక్ష్మారెడ్డి విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని గుర్తుచేశారు.



### ఆస్పత్రిలో చేరిన
# సోనియా గాంధీ
### శ్వాసకోశ సంబంధ సమస్యలతో చేరిక

**న్యూఢిల్లీ, జనవరి 6 :** కాంగ్రెస్ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. సోనియాగాంధీ తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమెను వైద్యులు పర్యవేక్షణలో ఉంచారు. ఆస్పత్రి వర్గాల సమాచారం ప్రకారం.. సోనియా గాంధీకి సీనియర్ పల్మనాలజిస్ట్ పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో నెలకొన్న తీవ్ర వాయు కాలుష్యం కారణంగానే సోనియా గాంధీకి ఈ అనారోగ్యం ఏర్పడినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కాలుష్య స్థాయిలు పెరగడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు సోనియాగాంధీకి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా వైద్యులు గమనిస్తున్నట్లు సమాచారం. కాగా గతంలోనూ సోనియాగాంధీ పలు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే.

# పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు

### కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ శ్రీనివాస గౌడ్

**మహబూబ్‌నగర్, జనవరి 6 :** ఉమ్మడి ఏపీలో అత్యంత దారుణంగా నష్టపోయిన జిల్లా పాలమూరు అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పాలమూరు జిల్లాను మంత్రులు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఆస్తులు కూడబెట్టుకున్నారు తప్ప రైతులను ఆదుకోలేదని విమర్శించారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వ్టటెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో రెండు ట్రిబ్యునల్‌లు ఏర్పాటైనా పాలమూరును పట్టించుకోలేదని అన్నారు. జూరాల ప్రాజెక్టు మొత్తం ఎండిపోతుందని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పంటలకు జూరాల ఆయకట్టుకు క్రాప్ హాలీడే ఇచ్చారని తెలిపారు. ఈ జూరాల నుంచి 70 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారా అని ప్రశ్నించారు. ఇదేం ప్రభుత్వం? అసలు నీళ్ల మీద సోయి ఉందా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేసుకున్నామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తట్టెడు మన్ను తీయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తారా అని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పాలమూరును సస్యశ్యామలం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. రాజకీయ కోణంలో చూడకుండా పాలమూరు బాగు చేయాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ 45 టీఎంసీలకు ఒప్పుకోమని తెలిపారు. మా పాలమూరు జిల్లాకు కేటాయించిన నీళ్లు మాకు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు మీరిచ్చిన నీళ్ల కంటే డబుల్ నీళ్లను కేటాయించుకుంటామని తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సర్పంచ్ దేవి సింగ్

**బీర్కూర్, రాజముద్ర న్యూస్ :** బీర్కూర్ మండలంలోని బీర్కూర్ తాండ సర్పంచ్ దేవి సింగ్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల లోని తరగతి గదులను తిరుగుతూ, పాఠశాల సమస్యలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం పట్ల సంతృప్తి వ్యక్తపరిచారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దిలీప్, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ భార్గవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## వికారాబాద్ పట్టణంలో ఏఐఎంఐఎం నూతన పట్టణ కమిటీని ఏర్పాటు

### పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఏఐఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ, వికారాబాద్ జిల్లా ఏఐఎంఐఎం పార్టీ ఇంచార్జ్ సమద్ బిన్ అబ్దాద్ ఆదేశానుసరం ఏఐఎంఐఎం వికారాబాద్ పట్టణ కమిటీని ఏఐఎంఐఎం వికారాబాద్ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి జాయింట్ సెక్రటరీలుగా మహమ్మద్ షరీఫ్, మహమ్మద్ మొహియుద్దీన్, షేక్ జలీల్, మహమ్మద్ నవాజ్ షరీఫ్, షేరు ఖాన్ ఎన్నుకోబడ్డారు. ట్రెజరర్ గా మహమ్మద్ ఇమ్రాన్, కమిటీ సభ్యులుగా మహమ్మద్ జాంగిర్, మహమ్మద్ సిరాజ్, అమీర్ ఖాన్, ఎజాజ్ ఖాన్, మహమ్మద్ ముజామిల్, యూత్ విభాగానికి మహమ్మద్ షేహాభాజ్ ఖాన్, మహమ్మద్ ముజాహిద్ లను ఎన్నుకొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో ఏఐఎంఐఎం పార్టీ తరపున పోటీ చేసే సభ్యులను ఎంపిక చేయడంలో ఈ కమిటీ కీలకపాత్ర వహిస్తుందని పదిమంది కౌన్సిలర్లను గెలిపించుకోవడమే లక్ష్యంగా ఈ కమిటీ కార్యాచరణ ఉంటుందని పట్టణ అధ్యక్షుడు ఉస్మాన్ తెలిపారు. అనంతరం ఆలంపల్లి కొత్తగాడి ఉర్దూ మీడియం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. అలంపల్లి ఉర్దూ మీడియం పాఠశాలలో టాయిలెట్స్, డైనింగ్ హాల్ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలపడంతో ఈ సమస్యను పార్టీ అధిష్టానం దృష్టికి తీస్కువెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జనవరి 7 నుండి 11 వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం

### మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** జనవరి 7 నుండి జనవరి 11వరకు త్రాగు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడ్తుందని మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లూరు నుండి గౌరిదేవిపల్లి వద్ద వాల్వ్ మరమ్మత్తుల నిర్వహణ కారణంగా ముడి నీరు రానందున వికారాబాద్ , తాండూర్, పరిగి నియోజకవర్గ పరిధిలో ఉన్నా మున్సిపాలిటీ, గ్రామాలకు నీటి సరఫరా చేయలేక పోతున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అంతరాయాన్ని గుర్తించి సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.





## కొత్తకొండ జాతరను సమన్వయంతో విజయవంతం చేయాలి

- సెంట్రల్ జోన్ డిసిపి కవిత
- కొత్తకొండ జాతర ఏర్పాట్ల పరిశీలన

**భీమదేవరపల్లి, జనవరి 6, రాజముద్ర న్యూస్ :** భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి జాతరను సమన్వయముతో విజయవంతంగా నిర్వహించాలని సెంట్రల్ జోన్ డీసీపీ కవిత సూచించారు. కొత్తకొండ గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని డీసిపి కవిత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న జాతరను శాంతియుతంగా, సాఫీగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను పరిశీలించి జాతరను విజయవంతంగా నిర్వహించేలా పోలీస్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గుంపుల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, అత్యవసర సేవలు, భక్తులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలు, సున్నిత ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ కమిటీతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. జాతరను శాంతియుతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, కొత్తకొండ నుండి వేలేర్ మల్లారం అక్కన్నపేట వెళ్లే వాహనదారులకు పెట్రోల్ పంపు నుండి ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు. డీసీపీ వెంట సీఐ రమేష్, ఎస్సై రాజు, ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడ 'మూసీ' పరివాహక ప్రాంతంలో

# నిరంతర విద్యుత్ వెలుగులు

- పాత కండక్టర్ల స్థానంలో ఏబీ కేబుళ్ల ఏర్పాటు
- వేసవిలో కోతలు లేకుండా పక్కా ప్రణాళిక
- క్షేత్రస్థాయిలో పర్యటించిన టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నరసింహులు



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు విద్యుత్ కష్టాల నుండి విముక్తి లభించనుంది. ఈ ప్రాంతంలో ఇకపై ఎలాంటి అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరాను అందించడమే లక్ష్యంగా టీజీఎస్పీడీసీఎల్ (టీజీ ఎస్పీ డీసీఎల్) యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. మంగళవారం 'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నరసింహులు పీర్జాదిగూడ విద్యుత్ కేంద్రం పరిధిలోని పలు ప్రభావిత ప్రాంతాలను అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు.

### ఆధునీకరణ పనులకు శ్రీకారం



ఈ సందర్భంగా డైరెక్టర్ నరసింహులు మాట్లాడుతూ, మూసీ పరివాహక ప్రాంతంలో దశాబ్దాలుగా ఉన్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న పాతబడిన కండక్టర్లను తొలగించి, వాటి స్థానంలో అత్యాధునిక ఏబీ కేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల విద్యుత్ చౌర్యం అరికట్టడమే కాకుండా, గాలివానలు వచ్చినప్పుడు వైర్లు తెగిపడే ప్రమాదం ఉండదని, లో-వోల్టేజీ సమస్య కూడా తలెత్తదని ఆయన వివరించారు.

### వేసవి సవాళ్లకు ముందస్తు సిద్ధం

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు డైరెక్టర్ వెల్లడించారు. 'పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉంది. లోడ్ మేనేజ్‌మెంట్ కోసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, పాత లైన్ల మరమ్మతులు వేగవంతం చేశాం' అని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు.

### అధికారుల బృందం పర్యటన

డైరెక్టర్ వెంట సీఈ కామేష్, ఎస్ఈ వెంకన్న, డీఈ లింగయ్య, ఏడీఈ విజయ్ కుమార్ రెడ్డి, ఏఈ సత్యనారాయణ రెడ్డి తదితర ఉన్నతాధికారులు ఉన్నారు. లైన్ల నిర్వహణ, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ (ఎఫ్ ఓ సి) కేంద్రాల పనితీరును వారు సమీక్షించారు. స్థానిక ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

ప్రజల ఇబ్బందులను గుర్తించి క్షేత్రస్థాయిలో పర్యటించిన విద్యుత్ అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల అధ్యక్షులు తుంగతుర్తి రవి, మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ కార్పొరేటర్ పప్పుల అంజిరెడ్డి, కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ తీసుకుంటున్న ఈ చర్యలు అభినందనీయమన్నారు. గతంలో చిన్న వర్షం పడినా గంటల తరబడి కరెంటు పోయేదని, ఇప్పుడు ఏబీ కేబుల్స్ వేయడం వల్ల ఆ సమస్య తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు భారీ సంఖ్యలో స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## 29వ జాతీయ యువజన ఉత్సవాలు

### 29వ జాతీయ యువజన ఉత్సవం-2026లో పాల్గొననున్న తెలంగాణ యువజన బృందం

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** 2026 జనవరి 9 నుంచి 12 వరకు ఢిల్లీలో జరగనున్న 29వ జాతీయ యువజన ఉత్సవం (ఎన్‌వైఎఫ్)- 2026లో తెలంగాణ రాష్ట్ర యువజన బృందం పాల్గొననుంది. ःవికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ) 2026ః కు ముందస్తు కార్యక్రమంగా కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఎంపికైన యువజన ప్రతినిధులను సన్మానించేందుకు తెలంగాణ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ సమన్వయంతో ःమై భారత్ తెలంగాణః మంగళవారం తెలంగాణ లోక్‌భవన్‌లో (రాజ్ భవన్) వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించింది. 29వ జాతీయ యువజన ఉత్సవం 2026లో పాల్గొనడానికి తెలంగాణ నుంచి మొత్తం 68 మంది యువజన ప్రతినిధులు ఎంపికయ్యారు. వీరిలో ःవికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ః విభాగంలో 45 మంది.. సాంస్కృతిక విభాగంలో 23 మంది ప్రతినిధులు ఉన్నారు. దేశవ్యాప్తంగా వచ్చే 3,000 మందికి పైగా యువతతో కలిసి వీరు ఈ ఉత్సవంలో పాల్గొంటారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో ःవికసిత్ భారత్ ఏ2047ః నిర్మాణానికి సంబంధించిన వినూత్న ఆలోచనలను వీరు పంచుకుంటారు. 2026 జనవరి 12న ఢిల్లీలోని భారత్ మండపంలో ఈ ఉత్సవ ముగింపు వేడుకలు జరగనున్నాయి. ఈ ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ యువ ప్రతినిధులతో



మాట్లాడారు. దేశ నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలను ప్రధాన మంత్రి ముందు ఆత్మవిశ్వాసంతో పంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. యువజన ప్రతినిధులకు ःవికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్□డీ) 2026ః లక్ష్యాలు, ప్రాముఖ్యతను తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్‌ఏటీజీ) ఉపాధ్యక్షులు-కార్యనిర్వాహక డైరెక్టర్, యువజన సర్వీసుల కమిషనర్ (ఇన్‌ఛార్జ్) డాక్టర్ ఏ. సోనీబాల దేవి (ఏఎఫ్ఎశ్) వివరించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ కార్యనిర్వాహక డైరెక్టర్ కే. వేణుగోపాల్ రావు, మై భారత్ అసిస్టెంట్ డైరెక్టర్ జీ. రాజేష్, హైదరాబాద్ జిల్లా యువజన అధికారి ఖుష్బూ గుప్త, రంగారెడ్డి జిల్లా యువజన అధికారి టీ. ఇషయా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి

### ఆర్‌వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ 10వ డివిజన్‌లో మార్నింగ్ వాక్‌లో భాగంగా మల్లికార్జున నగర్ ప్రాంతంలో ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక కాలనీ వాసులతో ప్రత్యక్షంగా మాట్లాడి, అక్కడ నెలకొన్న పలు సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా త్రాగునీటి పైప్‌లైన్ సమస్యలపై హెచ్ఎమ్ డబ్ల్యూఎస్ అధికారులతో, డ్రైనేజీ లీకేజీల సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు



ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు మెరుగుపడేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వంగేటి ప్రభాకర్ రెడ్డి, జంగచారీ, కవిడె కుమార్, రంజిత్ రెడ్డితో పాటు స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## పీర్జాదిగూడ టీజీఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రజాబాట..

- మాజీ మేయర్ అమర్ సింగ్, ఆర్వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి, పలువురు విద్యుత్ ఉన్నతాధికారులు ప్రజా బాట కార్యక్రమం



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ పీర్జాదిగూడ మూసి పరివాహక ప్రాంతంలో నిరంతర విద్యుత్తు సరఫరా కోసం టీజీఎస్‌పీడీసీఎల్ చేపడుతున్న చర్యలను మాజీ మేయర్ అమర్ సింగ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి వెంటనే పరిష్కరిస్తున్న విద్యుత్ అధికారుల కృషి అభినందనీయమన్నారు. ముఖ్యంగా పీర్జాదిగూడ ఏరియాలో ఏఈ సత్యనారాయణ రెడ్డి నిరంతరంగా శ్రమిస్తూ విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని కొనియాడారు. పాడైపోయిన కండక్టర్లను తొలగించి ఏవీ కేబుల్స్ అమర్చడం వల్ల భవిష్యత్తులో విద్యుత్ అంతరాయాలు లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పప్పుల అంజిరెడ్డి, కృష్ణ గౌడ్, జంగా చారి, వంగూరి పరమేష్,కవిడె కుమార్, మోహన్,నాగ రాజు, కొండల్ రెడ్డి, ఇర్ఫాన్, కరీం, టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నరసింహులు, సీఈ కామేష్, ఎస్ఈ వెంకన్న, డీఈ లింగయ్య, ఏడిఈ విజయ్ కుమార్ రెడ్డి, ఏఈ సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యుత్ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## దమ్ముంటే మాలాగా అభివృద్ధి చేసి చూపాలి

### తెల్లాపూర్ బిఆర్ఎస్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** 263 డివిజన్ తెల్లాపూర్ లో గతంలో పంచాయతీగా ఉన్నప్పుడు ఐదు సంవత్సరాలు, తర్వాత చైర్మన్ గా ఐదు సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వంలో హరీష్ రావు సహకారంతో తెల్లాపూర్ ను రాష్ట్ర రాజధానికి ఒక మణిహార పట్టణంగా తీర్చిదిద్దామంటూ, కాంగ్రెస్ నాయకుల ప్రెస్ మీట్ కు దీటుగా బదులిచ్చాడు, బిఆర్ఎస్ నాయకుడు మల్లెపల్లి సోమిరెడ్డి. ఇటీవల 263 డివిజన్ నుండి వెలిమేల గ్రామం విద్యుత్ నగర్ ఎమ్ఐజి లు వేరే డివిజన్లలో కలవడంపై ఆదివారం బిఆర్ఎస్ నాయకుల రిలే నిరాహార దీక్షలు చేసిన సంగతి తెలిసిందే. ఆ దీక్షపై కాంగ్రెస్ నాయకులు స్పందిస్తూ దొంగ దీక్షలు అంటూ వ్యక్తిగతంగా సోమిరెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ లు పెట్టి నిందించడంపై మండిపడ్డ బిఆర్ఎస్ నాయకులు. కాంగ్రెస్ మీరు అధికారంలో ఉన్నారు దమ్ముంటే ప్రజలకు అవసరమైన పనులు చేసి చూపించాలి, కానీ వ్యక్తిగతంగా దూషణలు చేసి రాజకీయాలు నడపవద్దని కాంగ్రెస్ నేతలకు సోమిరెడ్డి హితవు పలికారు.



## ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్‌ను కలిసిన కన్నాపూర్ సర్పంచ్

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** మండలంలో నీ కన్నాపూర్ గ్రామ ముత్తడి వాగు కట్ట మరమ్మతులను త్వరగా చేయుట గురించి అలాగే ఆన్లైన్ లో చేర్చడానికి వినతి పత్రం అందజేశారు , ఆయన వెంట ఉప సర్పంచ్ యశ్వంతరావు, వార్డ్ మెంబర్ నవీన్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## కీచక ఉపాధ్యాయుడి ఉద్యోగం ఊస్ట్

### విధుల నుండి తొలగిస్తూ డిఈఓ చైతన్య జైనీ ఉత్తర్వులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కూసుమంచి మండలంలోని నరసింహులగూడెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినీల పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎస్జిటి ఉపాధ్యాయుడు జి.వీరయ్యను ఉద్యోగం నుండి (రిమూవల్ ఫ్రం సర్వీస్) తొలగిస్తూ జిల్లా విద్యాధికారిణి చైతన్య జైనీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.గతేడాది అక్టోబర్ 19 న పాఠశాల విద్యార్థినీల పై ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులు పై అప్పటి విద్యాధికారిణి డా.పి.శ్రీజ స్పందించి విచారణ చేపట్టారు.విచారణ అనంతరం అక్టోబర్ 22న ఉపాధ్యాయుడు జి.వీరయ్యను సస్పెండ్ చేశారు.అదే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శివరావు సైతం సదరు ఉపాధ్యాయుడు పై పోలీస్ స్టేషన్ లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.జెడ్పీ సీఈవో నాగ పద్మజ,నేలకొండపల్లి ఎంఈఓ చలపతిరావు విచారణ చేపట్టి నివేదిక అందించడంతో తాజాగా ఉపాధ్యాయుడిని సర్వీస్ నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లితండ్రులు, మేధావులు,విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తం చేసారు.



## నేచురల్ ఐస్ క్రీమ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** హఫీజ్ పేట్ డివిజన్ లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ప్రమాణాలతో నేచురల్ ఐస్ క్రీమ్ ఫ్యాక్టరీ వినాయక నగర్ లో ప్రారంభోత్సవానికి వై.రవీంద్ర కుమార్ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొవ్వ సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రసాద్స్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ లయన్ డి ఎస్ ఆర్ ప్రసాద్, లీల ప్రసాద్ లు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ ప్రసాద్, మియాపూర్ డివిజన్ డి ఎస్ ఆర్ ప్రసాద్ టీమ్ సభ్యులు భాష, రవి, సురేందర్, రాంబాబు, మూర్తి, శేఖర్ నాయుడు, వెంకట్రావు, ఎం ఆర్ చౌదరి, వినోద్ చౌదరి, శ్రీను, శ్రీకాంత్, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, తులసి, పవన్, బాలు, చిన్న, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి, నరేష్ (నాని), పవన్, అభిజిత్, రాము తదితరులు పాల్గొన్నారు.



## బాన్సువాడ పిఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ రాజేష్ చంద్ర

**బాన్సువాడ, రాజముద్ర న్యూస్ :** బాన్సువాడ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర. ఈ సందర్భంగా ఆయన స్టేషన్లోని రికార్డులను, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ పిఎస్ కు వచ్చే బాధితులను గౌరవించాలన్నారు. ఫిర్యాదులను పెండింగ్లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. బాన్సువాడ పీఎస్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నియంత్రించాలన్నారు. పోలీసులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. రక్షకబట్టులు నియమ నిబంధనలు పాటించాలన్నారు. రద్దీ ఎక్కువ ఉండి ప్రదేశాలలో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అలాగే పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు తనిఖీ చేశారు. అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద గల ట్రాఫిక్ ను పరిశీలించాలన్నారు. ప్రయాణికులు ట్రాఫిక్ రూల్స్ ను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ టౌన్ సిఐ శ్రీధర్, గ్రామీణ సీఐ తిరుపతయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రశాంత వాతావరణంలో యూరియా పంపిణి

### హర్షం వ్యక్తం చేసిన రైతులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నిన్న,మొన్నటి వరకు యూరియా కోసం పడిగాపులు కాసి,హడావుడి చేసిన రైతులు కూసుమంచి మండల వ్యవసాయాధికారిణి రామడుగు వాణి పక్కా ప్రణాళికతో మంగళవారం యూరియా పంపిణి చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.మండలంలోని లోక్యాతండాగట్టుసింగారం, జుజ్జులరావు పేట,తురకగూడెం,గైగోళ్లపల్లి,చౌటపల్లి, జీళ్ళచెరువు, చేగొమ్మ, జక్కేపల్లి, పెరికసింగారం గ్రామాల్లో చేపట్టిన యూరియా పంపిణి కార్యక్రమం సౌకర్యవంతంగా ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.జుజ్జుల్ రావుపేట గ్రామానికి చెందిన రైతులు శ్రీరాముల రాము,బానోత్ శ్రీను అనే రైతులు స్పందించి యూరియా పంపిణిలో గ్రామాల వారిగా విభజించి ఒక్కో రోజు ఒక గ్రామానికి యూరియా అందిస్తున్న విధానం బాగుందని కితాబిచ్చారు.దీనికి తోడు యూరియా పంపిణిలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయాధికారులు నీడ కోసం టెంటు,కుర్చీలు ఏర్పాటు చేయడంతో రైతులు ఆనందాన్ని వెలిబుచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధాట్ల సతీశ్,పంచాయతీ కార్యదర్శి రవి శంకర్,మాజీ సొసైటీ ఛైర్మన్ వెల్లంపల్లి అశోక్, ఏఈఓలు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## వీబీ- జీ రామ్ జీ చట్టం ద్వారా

# కనీస వేతనాలకు పూర్తి రక్షణ

## ఎన్ఐఆర్‌డీపీఆర్ డీజీ డాక్టర్ నరేంద్ర కుమార్

- పాత ఎంజీఎన్ఆర్జీప చట్టాన్ని 'వీబీ- జీ రామ్ జీ' చట్టం నీరుగార్చడం లేదు.. మెరుగైన ఫలితాలు లక్ష్యంగా చేపట్టిన దిద్దుబాటు చర్య ఇది: ఎన్ఐఆర్‌డీపీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిస్ సత్యపాలన్
- తప్పుడు సమాచారాన్ని అరికట్టడం లక్ష్యంగా.. 'వీబీ- జీ రామ్ జీ' చట్టంపై పీఐబీ ఆధ్వర్యంలో వార్తాలాప్ మీడియా వర్క్‌షాప్




**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ).. "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్(గ్రామీణ)" చట్టంపై హైదరాబాద్‌లోని ఐసీఏఆర్– జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థలో మంగళవారం వార్తాలాప్ మీడియా వర్క్‌షాప్‌ను నిర్వహించింది. పాత్రికేయులకు అవగాహన కల్పించడం, ప్రతిపాదిత చట్టంపై వస్తున్న అసత్య సమాచారాన్ని అరికట్టడం లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. జాతీయ గ్రామీణాభివృద్ధి– పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్) డైరెక్టర్ జనరల్, ఐఏఎస్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్, ఎన్ఏఏఆర్ఎం తాత్కాలిక డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాత్రికేయులనుద్దేశించి డాక్టర్ జి. నరేంద్ర కుమార్ మాట్లాడుతూ... 'వికసిత భారత్‌గా ఎదగాలన్న దేశ ఆకాంక్షలకు అనుగుణంగా.. 2047 నాటికి ఆ



లక్ష్యాన్ని చేరుకునేలా ఓ స్పష్టమైన ప్రణాళికను వీబీ– జీ రామ్ జీ చట్టం అందిస్తుందన్నారు. "జాతీయ అభివృద్ధి ప్రాధాన్యాలతో గ్రామ పంచాయతీలను అనుసంధానించడం ద్వారా.. ఉపాధి కల్పనలోనూ, సుస్థిర – సమ్మిళిత గ్రామీణాభివృద్ధిలోనూ వీబీ– జీ రామ్ జీ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది" అని ఆయన అన్నారు. కనీస వేతనాలు తగ్గుతాయన్న ఆందోళనలను డాక్టర్ నరేంద్ర కుమార్ తోసిపుచ్చారు. కొత్త చట్టం కింద కనీస వేతనాలకు పూర్తి స్థాయి రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, గ్రామ స్థాయిలో ప్రాథమిక సదుపాయాలను అందించడం వీబీ– జీ రామ్ జీ చట్టం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జీవన నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. సంస్థాగత సంస్కరణలను ప్రస్తావిస్తూ, మూడు అంచెల్లోనూ ఉన్న పంచాయతీ రాజ్ సంస్థల అధికారిక భాగస్వామ్యం ద్వారా ఈ చట్టం వికేంద్రీకృత ప్రణాళిక, పర్యవేక్షణలను బలోపేతం చేస్తుందని డాక్టర్ జి. నరేంద్ర కుమార్ అన్నారు. పనుల్లో నాణ్యత, జవాబుదారీతనం లక్ష్యంగా.. ఈ చట్టం జిల్లా స్థాయిలో పర్యవేక్షణను మరింత మెరుగుపరుస్తుందని తెలిపారు. నిబంధనల ఆధారంగా రాష్ట్రాలకు కేటాయింపు పద్ధతిని కూడా ఈ విధానం ప్రవేశపెడుతోందనీ, దీంతో నిధుల కేటాయింపుల్లో స్పష్టత పెరగడమే కాకుండా, కేంద్రం – రాష్ట్రాల మధ్య 'సహకార సమాఖ్య' స్ఫూర్తి మరింత బలపడుతుందనీ అన్నారు. కార్మిక సమస్యలపై డాక్టర్ గోపాల్ లాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్నప్పటికీ, భారత్ నేడు వ్యవసాయ రంగంలో శ్రామికుల కొరతను ఎదుర్కొంటోందని తెలిపారు. వ్యవసాయం, అనుబంధ గ్రామీణ కార్యకలాపాల్లో కార్మికులను తిరిగి భాగస్వాములను చేయడం ద్వారా.. కొత్త చట్టం ఈ సమస్యను పరిష్కరిస్తుందన్నారు. కచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు అందించడంలో జర్నలిస్టులదే కీలక పాత్ర అని పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ మానస్ కృష్ణకాంత్ స్పష్టం చేశారు. వీబీ– జీ రామ్ జీ చట్టంపై తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్లకుండా చూసేందుకు ప్రత్యేకంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని మీడియా ప్రతినిధులను కోరారు. కొత్త చట్టం వీబీ– జీ రామ్ జీని ప్రవేశపెట్టడమంటే పాత చట్టాన్ని నీరుగార్చడం కాదని ఎన్ఐఆర్‌డీపీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిస్ సత్యపాలన్ వ్యాఖ్యానించారు. ఎంజీఎన్ఆర్జీఏ చట్టానికి సవరణలు చేయాల్సిన ఆవశ్యకతను ప్రొఫెసర్ ప్రముఖంగా ప్రస్తావించారు. మెరుగైన ఫలితాలు లక్ష్యంగా చేసుకున్న దిద్దుబాటు చర్యగా దీనిని అభివర్ణించారు. వివిధ పత్రికలు, చానళ్లకు చెందిన జర్నలిస్టులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఎన్ఏఏఆర్ఎం సీనియర్ అధికారులు, పీఐబీ మీడియా, కమ్యూనికేషన్ అధికారి వి. గాయత్రి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## హెచ్-1బీ వీసా ఫీజు పెంపు అంశం

### విచారణ వేగవంతం

**యూఎస్ :** హెచ్–1బీ వీసా ఫీజును పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకొన్న నిర్ణయాన్ని సమర్థిస్తూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును.. యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అప్పీల్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ విచారణను వేగవంతం చేయాలని తాజాగా ఛాంబర్ చేసిన అభ్యర్థనకు.. న్యాయస్థానం అంగీకరించింది. ఈ ఏడాది హెచ్–1బీ వీసాల కార్యక్రమంలో కంపెనీలు పాల్గొనాలా.. వద్దా..? అనేది ఈ కోర్టు తీర్పుపైనే ఆధారపడి ఉంటుందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ తన అభ్యర్థనలో పేర్కొంది. కేసు విచారణ ఆలస్యమైతే.. హెచ్–1బీ ఉద్యోగుల నియామకాలు ఆలస్యం అవుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. మార్చిలోపు ఫీజు పెంపుపై ఊరట కల్పించాలని కోరింది. విచారణ వేగవంతం గా జరపాలనే అభ్యర్థనను ట్రంప్ ప్రభుత్వం తరఫు న్యాయబృందం కూడా వ్యతిరేకించలేదు. ఫిబ్రవరిలో దీనిపై వాదనలు వింటామని కోర్టు పేర్కొంది. ఇక, గతేడాది సెప్టెంబరులో హెచ్–1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, ఇది వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ రుసుము అని ఆ తర్వాత వైట్‌హౌస్ పేర్కొంది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫెడరల్ కోర్టులో సవాల్ చేసింది. దీన్ని ఇటీవల విచారించిన న్యాయస్థానం.. ట్రంప్‌నకు అనుకూలంగా తీర్పునిచ్చింది.

## టీవీకే అధినేత విజయ్‌కు సీబీఐ నోటీసులు

**న్యూఢిల్లీ :** తమిళనాడులోని కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలని తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. ఈనెల 12న దిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నట్లు అధికార వర్గాలు



వెల్లడించాయి. ఇప్పటికే టీవీకే పార్టీకి చెందిన అనేక మంది ఆఫీస్ బేరర్లను సీబీఐ ప్రశ్నించింది. ఈ క్రమంలోనే పార్టీ అధినేత విజయ్‌ను ప్రశ్నించేందుకు సిద్ధమైంది. ఆయన్ను విచారించిన అనంతరం ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కరూర్‌లో గతేడాది సెప్టెంబరు 27న టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచారసభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించగా, 60 మంది గాయపడిన ఘటన పెను విషాదం నింపిన విషయం తెలిసిం దే. ఈ ఘటనపై తొలుత రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు చేయగా.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యా ప్తు బాధ్యతలు తీసుకుంది. దర్యాప్తులో భాగంగా తొక్కిసలాటకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తోంది. ఈ దర్యాప్తును సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో త్రిసభ్య కమిటీ పర్యవేక్షిస్తోంది.




## పార్లమెంట్‌లో జరిగే విధానంపై విద్యార్థులకు అవగాహన

### కాపేడ్ స్వచ్ఛంద సేవ సంస్థ

**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో పేరూరు బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం కాపేడ్ స్వచ్ఛంద సేవ సంస్థ డైరెక్టర్ లార్దురాజ్ ఆదేశాల మేరకు "మాక్ పార్లమెంటుగురించి విద్యార్థులకు పార్లమెంట్ లో జరిగే ప్రజాస్వామ్య వ్యవస్థలపై మాట్లాడే విధానం గురించి అవగాహ కల్పించి, వారితో ఈ ప్రదర్శన నిర్వహించారు.లోకసభలో చర్చలు ఎలా జరుతాయో,స్పీకర్ పాత్ర ఏమిటి, అనే అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పించి,విద్యార్థులు ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష నేతలుగా పాత్రలు పోషించారు.దేశ, రాష్ట్ర సమస్యలపై మంత్రులు ఎలా సమాధానం తెలియజేస్తారు,బిల్లులను ఎలా ప్రవేశపెడతారు అనే అంశాలను విద్యార్థుల ద్వారా నేర్పించి, వారి ద్వారా ప్రోగ్రాం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పేరూరు సర్పంచ్ గొడ్డే సరోజినీ దేవి పాల్గొని మాట్లాడుతూ..విద్యార్థులతో ఇలాంటి ప్రదర్శన నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులతో చైతన్య నింపడం, అభినందనీయమని,విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. విద్యార్థులకు ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించిన కాపేడ్ స్వచ్ఛంద సేవ సంస్థ వారు విద్యార్థులకు మరెన్నో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి,విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బద్రి, నాగమణి,ఈశ్వరరావు,పలు ఉపాధ్యాయులు,ఉపాధ్యాయురాలులు,కాపేడ్ సంస్థ కోఆర్డినేటర్ గోంది హనుమంత్ ,కామేష్. యానిమేటర్ నరేష్, ఇందిర ,ఉష, పద్మ ,భాస్కర్ ,రమాదేవి ,స్వరూప, సుజల, ప్రసాద్,విద్యార్థులు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** వ్యవసాయ కార్మికులకు జీవనాధారంగా యూపీఏ హయాంలో వామపక్షల సహకారంతో తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం తెచ్చిన విబిజి రాంజీ 2025 చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, పాలేరు డివిజన్ అధ్యక్షుడు .వి రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న పేద ప్రజల, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ, సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తొలుత సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ళ సత్యనారాయణ భవనం నుండి భారీ ప్రదర్శనగా బయలుదేరి ఎంపీడీవో కార్యాలయంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల పని భద్రతకు తీవ్ర ఆటంకం కలిగించే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విబిజి రాంజీ 2025 చట్టాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత రెండు దశాబ్దాలుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లక్షలాదిమంది పేద వ్యవసాయ కార్మికులకు పని కల్పిస్తూ జీవనాధారంగా మారిందన్నారు. నేడు బిజెపి తెచ్చిన విబిజి రాంజీ చట్టం ద్వారా వ్యవసాయ కార్మికులు జీవనోపాధి కోల్పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా గతంలో 90 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు 10 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వ్యవసాయ కార్మికులకు పని కల్పించగా నేడు 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్రాలు భరించాలనే విధానంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు పూనుకుందన్నారు. అనంతరం



స్థానిక ఎంపీడీవో ఎం ఎర్రయ్యకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీస్తుళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్, గుడవర్తి నాగేశ్వర రావు, మండల కార్యదర్శి రచ్చ నర్సింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెదపాక మల్లేశ్వరరావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, ఎస్ కే మహిమూద్, మందడపు మురళీకృష్ణ, గడిపూడి వెంకటేశ్వర్లు,(స్వామి), పోతనపోయిన పెరుమాళ్ళు, మున్నంగి లక్ష్మ, ఎడవల్లి సైదమ్మ, గురజాల ఉపేందర్ రావు, కొప్పుల సైదులు, పగడాల నాగేశ్వరరావు, సిరికొండ వెంకట్రావమ్మ, కోలికపొంగు వెంకట నరసయ్య, గరికపాటి మధు, సిపిఐ(ఎం) నాయకులు ఏటుకూరి రామారావు, భూక్య కృష్ణ, మారుతి కొండలరావు, దండ సూర్యనారాయణ, నెల్లూరు వీరబాబు, దేగల వెంకటేశ్వర రావు, గాదె వెంకటేశ్వర్లు, కాల్వ కోటేశ్వరరావు, గురజాల వెంకటేశ్వర్లు, మంగనపల్లి ధనకోటి మంగనపల్లి నరసింహారావు, ఊటుకూరి కుటుంబరావు, సామల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాకు త్వరలో 600 బిలియన్ డాలర్ల ఆదాయం


### డొనాల్డ్ ట్రంప్


**వాషింగ్టన్ :** అమెరికాకు త్వరలో 600 బిలియన్ డాలర్ల (సుమారు రూ.54 లక్షల కోట్లు) ఆదాయం సమకూరనుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ప్రపంచ దేశాలపై తాను విధించిన టారిఫ్‌లను సమర్థించుకుంటూ ఈ మేరకు పోస్ట్ పెట్టారు. సుంకాల విషయంలో తాను అనుసరిస్తోన్న విధానాలు దేశాన్ని ఆర్థికంగా, భద్రతపరంగా బలోపేతం చేశాయని వెల్లడించారు. దేశంపై గౌరవం లేని కొన్ని మీడియా సంస్థలు ఈ విషయాన్ని వెల్లడించేందుకు నిరాకరిస్తున్నాయన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి శత్రువు, మిత్రుడు అనే తేడా లేకుండా పలు దేశాలపై టారిఫ్‌ల మోత మోగించిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి ముడిచమురు కొంటుందన్న నెపంతో భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు 50 శాతం సుంకాలు వేసింది. ఒకవైపు రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతోన్న సమయంలో ఈ మోత మోగించింది. కాగా.. అధ్యక్షుడు విదేశాలపై విధించిన టారిఫ్‌లపై అమెరికా సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది. ట్రంప్‌నకు టారిఫ్‌లు విధించే అధికారంపై అక్కడి సుప్రీంకోర్టు సమీక్షించి తీర్పు ఇవ్వనుంది. తీర్పు ఫలితం ఎలా ఉన్నా అందుకు తాము సిద్ధంగా ఉన్నామని వైట్‌హౌస్ ఇప్పటికే వెల్లడించింది. "వైట్‌హౌస్ ప్లాన్–బితో సిద్ధంగా ఉంటుంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండకపోవడం అజాగ్రత్తే అవుతుంది. సుప్రీంకోర్టు తీర్పు మాకు సానుకూలంగా వస్తుందన్న ఆశాభావంతో ఉన్నాం" అని వైట్‌హౌస్ మీడియా ప్రతినిధి కరోలిన్ లీవిట్ గతంలో వెల్లడించారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలున్నా.. అమెరికా నుంచి కొత్త టారిఫ్ భయాలు మన మార్కెట్లను వెంటాడాయి. ప్రధాన షేర్లయిన రిలయన్స్, ట్రెంట్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. ఆంక్షల వేళ రష్యా చమురును రిలయన్స్ దిగుమతి చేసుకుంటోందంటూ వచ్చిన కథనాలతో కంపెనీ షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. ఈ వార్తలు అవాస్తవం అంటూ సంస్థ ఖండించినప్పటికీ.. కంపెనీ షేర్లు ఇంట్రాడేలో 5 శాతం మేర నష్టపోయాయి. చివరికి 4.39 శాతం నష్టంతో 1508.90 వద్ద ముగిశాయి. క్యూ3 ఆదాయ అంచనాలు అందుకోవడంలో విఫలమైన నేపథ్యంలో ట్రెంట్ షేర్లు 8.46 శాతం నష్టపోయి రూ.4055 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85,331.14 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,439.62) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,900 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 376.29 పాయింట్ల నష్టంతో 85,063.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 71.60 పాయింట్ల నష్టంతో 26,178.79 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.16గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.84 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,449 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. సెన్సెక్స్ టాప్ లూజర్స్: ట్రెంట్, రిలయన్స్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సెన్సెక్స్ టాప్ గెయినర్స్: ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, సన్‌ఫార్మా, ఎస్‌బీఐ, టీసీఎస్






## అదానీ 1000 కోట్ల ఎన్‌సీడీలు ఇష్యూ

**న్యూఢిల్లీ :** అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడో విడత నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. మొత్తం రూ.1000 కోట్ల విలువైన ఎన్‌సీడీల జారీ ప్రారంభమైన 45 నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తయ్యింది. ప్రాథమిక ఇష్యూ పరిమాణం రూ.500 కోట్లు కాగా.. 10 నిమిషాల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యింది. గ్రీన్ షూ ఆప్షన్‌తో (స్పందన ఆధారంగా) కలిపి మొత్తం వెయ్యి కోట్ల రూపాయల ఎన్‌సీడీల సబ్‌స్క్రిప్షన్ గంటలోపే పూర్తయ్యింది. జనవరి 6న ప్రారంభమైన ఈ ఇష్యూ జనవరి 19న ముగియనుంది. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈల్లో ఈ ఎన్‌సీడీలను నమోదు చేయనున్నారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ విధానం కింద తొలుత దరఖాస్తు చేసుకున్నవారికి ఎన్‌సీడీల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వార్షికంగా ఈ ఎన్‌సీడీలపై 8.9% ప్రతిఫలాన్ని సంస్థ ఆఫర్ చేస్తోంది. ఇక్రా, కేర్ రేటింగ్స్ నుంచి (స్టేబుల్ అవుట్‌లుక్) రేటింగ్ పొందింది. ఇదే రేటింగ్ కలిగిన బాండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే అధిక ప్రతిఫలం ఇస్తుండడంతో రిటైల్ మదుపర్లు కొనుగోళ్లకు పోటీపడ్డారు. గతేడాది జులైలో కూడా రూ.1000 కోట్ల విలువైన ఇష్యూలను అదానీ ఎంటర్‌ప్రైజెస్ జారీ చేసింది. అప్పట్లో తొలి మూడు గంటల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అవ్వడం గమనార్హం. తాజా ఎన్‌సీడీల జారీ ద్వారా వచ్చే నిధుల్లో 75 శాతం రుణాల చెల్లింపులకు, మిగిలినది సాధారణ కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది. ఈ ఎన్‌సీడీలు 24, 36, 60 నెలల వ్యవధితో తీసుకొచ్చారు. త్రైమాసికానికి, ఏటా, ఏక మొత్తంలో వడ్డీ చెల్లింపు ఆప్షన్లతో తీసుకొచ్చారు. మౌలిక వసతుల కల్పనలో ప్రస్తుతం అదానీ గ్రూప్ వేగంగా విస్తరిస్తోంది. ఇటీవలే ఆ సంస్థ నిర్మించిన నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఇటీవల ప్రారంభమైంది. విశాఖలో గూగుల్‌తో కలిసి డేటా సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు దేశమంతటా పలు రోడ్డు ప్రాజెక్టులను నిర్వహిస్తోంది.



## నెట్స్‌లో చెమటోడుస్తున్న హిట్‌మ్యాన్

న్యూజిలాండ్ క్రికెట్ జట్టు జనవరి 11 నుంచి భారత్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా మూడు వన్డేలు, అయిదు టీ20లు ఆడనుంది. న్యూజిలాండ్‌తో వన్డేల కోసం రోహిత్ శర్మ ప్రస్తుతం సిద్ధమవుతున్నాడు. నెట్స్‌లో చెమటోడ్చుతున్నాడు. దీనికి సంబంధించిన ఫొటోను ఇన్‌స్టా స్టోరీలో పంచుకున్నాడు. గత సంవత్సరం రోహిత్ శర్మ క్రికెట్‌లో పలు మైలురాళ్లను అధిగమించాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్‌లో 76 పరుగులు సాధించాడు. టీమ్ఇండియా విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించాడు. అలాగే అతడి కెరీర్‌లోనే మొదటిసారిగా ఐసీసీ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో నం.1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గానూ నిలిచాడు. ఇంతకుముందు ఈ రికార్డ్ 2015 నుంచి షాహిద్ అఫ్రిది (351 సిక్స్‌లు) పేరిట ఉండేది. ప్రస్తుతం రోహిత్ శర్మ 279 వన్డేల్లో 355 సిక్స్‌లు బాదాడు. అలాగే అంతర్జాతీయ క్రికెట్‌లో 20,000 పరుగులు పూర్తి చేసుకున్న బ్యాటర్‌గా రికార్డ్ సృష్టించాడు. రోహిత్ శర్మ తాజాగా.. విజయ్ హజారే ట్రోఫీలో ముంబయి తరపున ఆడాడు. సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో భారీ శతకం (155) బాదాడు. అయితే ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో డకౌట్‌గా వెనుదిరిగాడు. అలాగే హిట్ మ్యాన్ ఈ సంవత్సరం 14 వన్డే ఇన్నింగ్స్‌ల్లో 100కు పైగా స్ట్రైక్ రేట్, 50.00 యావరేజ్‌తో 650 పరుగులు సాధించాడు. ఇందులో రెండు శతకాలు, నాలుగు అర్ధ శతకాలున్నాయి. రోహిత్ శర్మ ఇప్పటికే టీ20లు, టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన నేపథ్యంలో కేవలం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. వన్డే వరల్డ్ కప్ 2027లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నాడు.

# అది నాకు పునర్జన్మ

## యువరాజ్ సింగ్



టీమ్ఇండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ప్రాణాంతకమైన క్యాన్సర్‌ను జయించిన విషయం తెలిసిందే. ఒకవైపు అతడు క్యాన్సర్‌తో బాధ పడుతూనే.. టీమ్ఇండియా 2011 వరల్డ్ కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. అతడు క్యాన్సర్ బారినపడిన రోజుల్లో తనకు ఎదురైన అనుభవాలను ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్‌తో ఇటీవల పంచుకున్నాడు. ఈ వీడియోను పీటర్సన్ తన యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేశాడు. డాక్టర్లు తాను 3 నుంచి 6 నెలలు మాత్రమే బతుకుతానని చెప్పారని వాపోయాడు. కీమో థెరపీ చేయించుకోకపోతే.. గుండెపోటు వచ్చే అవకాశముందని వారు హెచ్చరించారని వివరించాడు. 'మూడు నుంచి ఆరు నెలలే బతుకుతానని డాక్టర్లు చెప్పారు. క్యాన్సర్ ట్యూమర్ నా ఊపిరితిత్తి, హృదయం మధ్యలో ఉందని వారు అన్నారు. అది నరంపై ఒత్తిడి తెస్తోందన్నారు. ఒకవేళ నేను కీమో థెరపీకి వెళ్లకుంటే గుండెపోటు వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరించారు' అని యువరాజ్ సింగ్ వెల్లడించాడు. అలాగే తాను టెస్ట్ ఆడటం కోసం ఆస్ట్రేలియాలో పర్యటించాల్సిన సమయంలోనే క్యాన్సర్ చికిత్స కోసం అమెరికా వెళ్లాల్సి వచ్చిందని.. అప్పటి సంగతులను గుర్తు చేసుకున్నాడు. 'నేను దాదాపు ఏడు సంవత్సరాలు వేచి చూశాను. సుమారు 40 టెస్టులకు 12వ ఆటగాడిగా ఉన్న తర్వాత టెస్ట్ క్రికెట్‌లో నా స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలనుకున్నా. కానీ నేను క్యాన్సర్ చికిత్స కోసం అమెరికా వెళ్లాల్సి వచ్చింది. అంతకుమించి నా ముందు మరో మార్గం లేకపోయింది' అని యువరాజ్ సింగ్ వివరించాడు. అతడు 2011-2012లో అమెరికాలో కీమోథెరపీ చేయించుకున్నాడు. ఆ సమయంలో డాక్టర్ల మాటలు తనలో ధైర్యం నింపాయన్నారు. 'నేను క్యాన్సర్‌ను జయించి.. ఆరోగ్యంగా నడుచుకుంటూ ఆసుపత్రికి వెళ్లిపోతానని డా.ఐన్‌హార్న్ చెప్పా రు. ఆ మాటలు నాకు బలాన్నిచ్చాయి. నేను క్యాన్సర్ నుంచి కోలుకున్నాక.. ఇకపై క్రికెట్ ఆడొచ్చని వారు చెప్పాక.. అది నాకు పునర్జన్మలా అనిపించింది' అని యువీ అన్నాడు. క్యాన్సర్ నుంచి కోలుకున్న తర్వాత యువరాజ్ సింగ్ టీమ్ఇండియా తరఫున పలు అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. 2013లో ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 మ్యాచ్‌లో అతడు కేవలం 35 బంతుల్లోనే 77రి పరుగులు సాధించాడు. అలాగే వన్డేల్లో తన వ్యక్తిగత అత్యధిక స్కోర్ 150 పరుగులను ఇంగ్లాండ్‌పై కటక్ వేదికగా 2017లో జరిగిన మ్యాచ్‌లో సాధించాడు. తర్వాత అదే సంవత్సరం వెస్టిండీస్ టూర్‌లో అతడు చివరిసారిగా మైదానంలో కనిపించాడు. అనంతరం 2019లో యువరాజ్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు.




## ఎల్ఐసీ నుంచి జీవన్ ఉత్సవ్ సింగిల్ ప్రీమియం ప్లాన్

ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ జీవన్ ఉత్సవ్ పేరిట సింగిల్ ప్రీమియం ప్లాన్‌ను ప్రకటించింది. జనవరి 12 నుంచి దీని విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు మంగళవారం సమాచారం ఇచ్చింది. నాన్ పార్టిసిపేటింగ్, నాన్‌లింక్డ్, ఇండివిడ్యువల్, సేవింగ్స్, పూర్తి జీవితకాలానికి బీమా అందించే ప్లాన్ ఇది. ప్రీమియం, ఇతర వివరాలు వెల్లడించలేదు. జీవన్ ఉత్సవ్ పేరిట రెండేళ్ల క్రితం ఓ పాలసీని ఎల్ఐసీ తీసుకొచ్చింది. దానికే మార్పులు చేసి సింగిల్ ప్రీమియంగా తీసుకొచ్చే అవకాశం ఉంది. ఒకసారి పాలసీని కొనుగోలు చేస్తే జీవితాంతం ఆదాయం పొందొచ్చన్నమాట.

### పాలసీ పునరుద్ధరణకు అవకాశం

మరోవైపు లాప్స్ అయిన పాలసీలను పునరుద్ధరించుకునే అవకాశం కల్పిస్తూ ప్రత్యేక పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఎల్ఐసీ చేపట్టింది. ప్రీమియం చెల్లింపుల గడువు దాటి, కాలవ్యవధి పూర్తికాని పాలసీలను ఈ కార్యక్రమంలో భాగంగా పునరుద్ధరించుకోవచ్చు. జనవరి 1 నుంచి మార్చి 2 వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఇందులోభాగంగా ఆలస్య రుసుము విషయంలోనూ రాయితీ ఇస్తున్నట్లు ఎల్ఐసీ ప్రకటించింది. నాన్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లపై గరిష్ఠంగా 30 శాతం (రూ.5వేల వరకు), మైక్రో ఇన్సూరెన్స్ ప్లాన్లపై నూరు శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయి ఐదేళ్లు లేదా అంతకంటే తక్కువ సమయం ఉన్న పాలసీలను మాత్రమే పునరుద్ధరించుకోవచ్చని ఎల్ఐసీ స్పష్టం చేసింది.




## ముస్తాఫిజుర్ రెహమాన్‌కు పరిహారం అందే అవకాశముందా?

**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆ దేశంలో హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ఐపీఎల్‌లో పాల్గొనడండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇటీవల ముగిసిన ఐపీఎల్ మినీవేలంలో కేకేఆర్ అతన్ని రూ.9.20 కోట్లకు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతన్ని రిలీజ్ చేయమని బీసీసీఐ.. కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఆదేశించడంతో కేకేఆర్ విడుదల చేసింది. అనంతరం బంగ్లాదేశ్ ప్రభుత్వం.. తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే తాము భారత్‌లో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌లో భద్రతా కారణాల రీత్యా పాల్గొనలేమని, తమ మ్యాచ్ వేదికలను మరో చోటుకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్.. ఐసీసీకి విన్నవించింది. అయితే క్రికెట్‌కు సంబంధం లేని కారణం వల్ల రెహమాన్.. ఐపీఎల్‌కు దూరం కావడంతో అతడు పరిహారం పొందే అవకాశం లేదని తెలుస్తోంది. ఐపీఎల్ ఆటగాళ్లు పొందే మొత్తాల మీద బీమా ఉంటుంది. విదేశీ క్రికెటర్లు శిబిరంలో చేరిన తర్వాత లేదా టోర్నమెంట్ సమయంలో గాయపడితే ఫ్రాంఛైజీ పరిహారం చెల్లిస్తుంది. సాధారణంగా 50 శాతం వరకు బీమా నుంచి చెల్లింపులు చేస్తారు. అయితే ముస్తాఫిజుర్ రెహమాన్ ఐపీఎల్‌ను వీడటానికి గాయం, క్రికెట్ సంబంధిత అంశాలు కారణం కాదు. దీంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు అతడికి పరిహారం చెల్లించే అవకాశం లేదని సమాచారం. బీమా సంస్థలు సైతం ఒక్క రూపాయి కూడా ఇవ్వవని తెలుస్తోంది. చట్టపరంగా ముందుకువెళ్లడం ఒక్కటే ముస్తాఫిజుర్ రెహమాన్ ముందున్న మార్గం. అయితే ఐపీఎల్ భారత చట్టపరిధిలోకి వస్తుంది. ఏ విదేశీ క్రికెటర్ కూడా కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఆఫ్ స్పోర్ట్స్ మార్గంలో పరిష్కరించుకునే సాహసం చేయరు. దీంతో అతడు పరిహారంగా ఒక్క రూపాయి కూడా పొందే అవకాశం లేదని క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు.

### సవాళ్లను స్వీకరించేందుకు

# గిల్ సిద్ధం : హర్భజన్ సింగ్



టీమ్ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్.. శుభ్‌మన్‌గిల్‌కు మద్దతుగా నిలిచాడు. అలాగే, గిల్‌కు వన్డే జట్టు కెప్టెన్సీ అప్పగించడాన్ని సమర్థించాడు. శుభ్‌మన్ గిల్ సవాళ్లను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాడని హర్భజన్ సింగ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆశాభావం వ్యక్తం చేశాడు. మెడకు గాయం అనంతరం వన్డే జట్టులోకి గిల్.. జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌తో పునరాగమనం చేయబోతున్నాడు. అలాగే ఇటీవల ప్రకటించిన టీ20 వరల్డ్ కప్ 2026లో స్థానం కోల్పోయాడు. దీనిపై హర్భజన్ సింగ్ తన అభిప్రాయం వ్యక్తం చేశాడు. 'శుభ్‌మన్ గిల్ పునరాగమనంపై నాకేమాత్రం సందేహం లేదు. టీమ్ఇండి యా కోరుకునే కాంబినేషన్ వల్లే టీ20 ఫార్మాట్‌లో అతడు స్థానం పొందలేకపోయాడు. వన్డే, టెస్ట్ మ్యాచుల్లో అతడి సారథ్యంలో జట్టు బాగా ఆడుతుంది. అలాగే న్యూజిలాండ్‌తో సిరీస్‌ను కూడా టీమ్ఇండియా సొంతం చేసుకుంటుంది' అని హర్భజన్ సింగ్ అన్నాడు. అలాగే టీ20 వరల్డ్‌కప్ 2026 కోసం ఎంపిక చేసిన భారత జట్టు కూర్పు బాగుందని హర్భజ న్ సింగ్ ప్రశంసించాడు. 'జట్టు కూర్పు బాగుంది. శుభ్‌మన్ జట్టులో లేకపోవడం మాత్రం కాస్త బాధ కలిగించింది. కానీ అతడు త్వరలోనే మరిన్ని అవకాశాలు పొందుతాడు. జట్టులో ఉన్నవాళ్లంతా మ్యాచ్ విన్నర్లే. మనం వరుసగా వరల్డ్‌కప్‌లు గెలుస్తామనే నమ్మకం నాకుంది. ఎందుకంటే మనకు అలాంటి జట్టు ఉంది' అని హర్భజన్ సింగ్ విశ్లేషించాడు. భారత జట్టులో స్పిన్ దళమూ బాగుందని అతడు ప్రశంసించాడు. 'కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ తమ స్పిన్‌తో మ్యాచుల్ని గెలిపించగలరు. బ్యాటర్లు ఇప్పటికీ వరుణ్ చక్రవర్తి స్పిన్‌ను అర్థం చేసుకోలేకపోతున్నారు. కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో వైవిధ్యం ఉంటుంది. స్పిన్ కాంబినేషన్ చక్కగా ఉంది. వారు గాయాల పాలవ్వకుండా.. చాలాకాలం పాటు టీమ్ఇండియాకు సేవలందించాలని కోరుకుంటున్నా' అని హర్భజన్‌సింగ్ అన్నాడు.




## ఆ వార్త పచ్చి అబద్ధం..

### 'రష్యా చమురు'పై రిలయన్స్ స్పష్టత

భారత్‌కు చెందిన ప్రముఖ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ గత కొంతకాలంగా రష్యా చమురును దిగుమతి చేసుకుంటోందంటూ అంతర్జాతీయ మీడియాలో జరుగుతోన్న ప్రచారంపై ఆ సంస్థ స్పందించింది. ఆ కథనాలన్నీ అవాస్తవమని వెల్లడించింది. ఇలాంటి అసత్య వార్తలతో తమ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల వేదికగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మంగళవారం దీనిపై ప్రకటన విడుదల చేసింది. "రష్యా చమురుతో ఉన్న మూడు నౌకలు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జామ్‌నగర్ రిఫైనరీకి బయల్దేరాయంటూ బ్లూమ్‌బర్గ్ కథనం రాసింది. అది పచ్చి అబద్ధం. గత మూడు వారాల్లో జామ్‌నగర్ రిఫైనరీ రష్యా నుంచి ఎటువంటి కార్గోను స్వీకరించలేదు. జనవరిలోనూ రష్యా చమురు డెలివరీలు ఉంటాయని మేం అనుకోవడం లేదు. జనవరి డెలివరీలకు సంబంధించి రష్యా చమురు కొనుగోళ్లను మేం తిరస్కరించామన్న విషయాన్ని వారు విస్మరించి.. మా ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు కథనం రాశారు. పారదర్శక జర్నలిజంలో ముందుంటామని చెప్పేవారు ఇలాంటి అసత్య కథనాలను ప్రచురించడం బాధాకరం" అని రిలయన్స్ తమ ప్రకటనలో స్పష్టం చేసింది. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిఫైనరీ.. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం. భారత ఇంధన సరఫరా, ఎగుమతుల్లో ఈ రిఫైనరీ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ చమురు శుద్ధి కేంద్రానికి రష్యా చమురు వెళ్తోందంటూ గతవారం బ్లూమ్‌బర్గ్ కథనం రాసింది. దాదాపు 2.2 మిలియన్ బ్యారెళ్ల ఉరల్స్ (రష్యా ప్రధాన చమురు)ను ఈ నౌకలు తీసుకెళ్తున్నాయని, జనవరిలో ఈ కార్గోల డెలివరీ ఉండొచ్చని ఆ కథనం పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు విధించిన వేళ ఈ వార్త తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే తాజాగా రిలయన్స్ దీనిపై స్పష్టతనిచ్చింది.

# ట్రావిస్ హెడ్, స్టీవ్‌స్మిత్ భారీ శతకాలు

### 134 పరుగుల ఆధిక్యంలో ఆస్ట్రేలియా



**సిడ్నీ:** యాషెస్ సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు అయిదో టెస్ట్ మ్యాచ్‌లో తలపడుతున్న విషయం తెలిసిందే. 166/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆస్ట్రేలియా జట్టు మూడో రోజు ఆట ప్రారంభించింది. ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు నష్టపోయి 518 పరుగుల భారీ స్కోర్ చేసింది. ప్రస్తుతం 134 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (163, 166 బంతుల్లో, 24 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (129, 205 బంతుల్లో, 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో ఆకట్టుకున్నారు. నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన నీసర్ 24 పరుగులు చేశాడు. చివరి టెస్ట్ మ్యాచ్ ఆడుతున్న ఉస్మాన్ ఖవాజా (17) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. అలెక్స్ కేరీ (16), కామెరూన్ గ్రీన్ (37) సైతం పెద్దగా పరుగులు చేయలేదు. వెబ్‌స్టర్ 42రి (58 బంతుల్లో, 4 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో బ్రైడన్ కార్సే 3, బెన్‌స్టోక్స్ 2, జోష్ టంగ్, జాకబ్ బెథెల్ తలో వికెట్ తీసుకున్నారు.

www.rajamudranews.com
రాజముద్ర
తెలుగు దిన పత్రిక

## ఉర్రూతలూగించేలా
# ప్రభాస్ నాచే.. నాచే సాంగ్

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ది రాజా సాబ్‌పై ప్రేక్షకుల్లో అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దర్శకుడు మారుతి హారర్ ఫాంటసీ జానర్‌లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండటంతో ప్రచార కార్యక్రమాలు వేగం పెంచాయి. ఇప్పటికే విడుదలైన 'రెబల్ సాబ్', 'సహనా సహనా' పాటలు, 'రాజే యువరాజే' మ్యూజిక్ బిట్ సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా విడుదలైన మరో స్పెషల్ సాంగ్ చర్చనీయాంశంగా మారింది.సోమవారం ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో 'నాచే నాచే' ఫుల్ వీడియో సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ పాట 1982లో మిథున్ చక్రవర్తి నటించిన డిస్కో డ్యాన్సర్ సినిమాలోని సూపర్ హిట్ నంబర్ కోయి యహాన్ నాచే'కు ఆధునిక రీమిక్స్‌గా రూపొందింది. అప్పట్లో బప్పీ లహరి అందించిన ఒరిజినల్ ట్యూన్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత అదే పాటను నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా కొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ ముగ్గురూ గ్లామర్‌తో పాటు స్టెప్పుల విషయంలోనూ పోటీపడుతూ కనిపించారు.

## ప్యారిస్ లే గ్రాండ్ థియేటర్‌లో
# వారణాసి టీజర్ ప్రదర్శన

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి' కోసం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం తాజాగా సరికొత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంది. జనవరి 5న ఈ సినిమా టైటిల్ టీజర్‌ను పారిస్‌లోని లే గ్రాండ్ రెక్స్ థియేటర్‌లో ప్రదర్శించారు. ఇంటర్నేషనల్ ఆడియన్స్ నుంచి ఆ వీడియోకు మంచి స్పందన వచ్చింది. ఈ విషయం తెలుపుతూ లే గ్రాండ్ రెక్స్ తన అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. దీంతో అక్కడ ప్రదర్శించిన తొలి భారతీయ సినిమా గ్లింప్స్‌గా 'వారణాసి' రికార్డు నెలకొల్పింది. ఇది ఇండియన్ సినిమాకు గొప్ప గుర్తింపు అని అభిమానులు భావిస్తున్నారు. గతంలో రజనీకాంత్ 'కబాలి', ప్రభాస్ 'బాహుబలి 2', 'సాహో' చిత్రాలను ఈ థియేటర్‌లో ప్రదర్శించారు. అయితే విడుదలకు ముందే భారీ స్థాయిలో గ్లింప్స్ లాంఛ్ ఈవెంట్ జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. యాక్షన్ అడ్వెంచర్ మూవీగా 'వారణాసి' సిద్ధమవుతోంది. ఇందులో మహేశ్‌బాబు 'రుద్ర' పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ పవర్‌ఫుల్ పాత్ర కోసం ఆయన ప్రాచీన భారత యుద్ధ కళ కలరిపయట్టు నేర్చుకున్నారు. ఇందులో కొన్ని సన్నివేశాల్లో ఆయన రాముడిగానూ కనిపించనున్నారు. మందాకిని పాత్రలో ప్రియాంక చోప్రా, కుంభ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రం 2027 ఏప్రిల్ 9న విడుదల కానున్నట్లు రెండు రోజులుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక సమాచారం కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.







## చిరు సినిమా
# టిక్కెట్ వేలం..
### రూ.1.11లక్షలకు సొంతం

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేయగా హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. తాజాగా అమలాపురంలో ఈ సినిమా టికెట్‌ను ఒక అభిమాని వేలంపాటలో రూ.1.11లక్షలకు సొంతం చేసుకున్నారు. పట్టణంలోని వెంకటరమణ థియేటర్‌లో ఈ వేలంపాట జరగ్గా.. మెగా అభిమాని వెంకట సుబ్బారావు ఈ టికెట్‌ను దక్కించుకున్నారు. చిరంజీవి సరసన నయనతార కనిపించనున్న ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో నటించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు ఆకట్టుకోవడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీని ప్రీరిలీజ్ ఈవెంట్ జనవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.



## ది రాజాసాబ్ సినిమా
# రన్‌టైమ్ 3గంటలైనే
### సినిమా టిక్కెట్ల ధరల పెంపునకు దరఖాస్తు

మూడు గంటల రన్‌టైమ్. ప్రస్తుతం పాన్ ఇండియా కథలన్నీ కాస్త అటూ ఇటూగా ఇదే నిడివితో వస్తున్నాయి. ఈ విషయంలో అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఓ అడుగు ముందున్నారు. 'బాహుబలి' తర్వాత ఆయన చేసిన సినిమాలన్నీ ఇలాగే అలరించాయి. ఇప్పుడు మారుతి దర్శకత్వంలో ఆయన నటించిన హారర్ ఫాంటసీ థ్రిల్లర్ 'ది రాజాసాబ్' కూడా అదే బాటలో పయనిస్తోంది. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ మూవీ రన్‌టైమ్ బయటకు వచ్చింది. 3 గంటలా 9 నిమిషాలతో ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలో 'ది రాజాసాబ్' అలరించనుంది. సినిమాలో తల నరికే సన్నివేశానికి మాత్రం సెన్సార్ కట్ చెప్పింది. జనవరి 9న ఈ చిత్రం విడుదల కానుండగా, ఒకరోజు ముందుగానే అంటే జనవరి 8న రాత్రి స్పెషల్ ప్రీమియర్‌లను ఏర్పాటు చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు దరఖాస్తు చేసుకుంది. తెలంగాణలో ఉదయం 4గంటల షోకు కూడా అనుమతి ఇవ్వాలని కోరింది. స్పెషల్ ప్రీమియర్ టికెట్ ధరను సింగిల్ స్క్రీన్‌లో రూ.800, మల్టీప్లెక్స్‌లలో రూ.1000 పెంచుకునేలా అనుమతి ఇవ్వాలని కోరింది. జనవరి 9 నుంచి 11 వరకూ సింగిల్ స్క్రీన్‌లో రూ.105, 12 నుంచి 18వ తేదీ వరకూ రూ.62, మల్టీప్లెక్స్‌లో వరుస తేదీల్లో రూ.132, రూ.89 పెంచుకునేలా అనుమతి ఇవ్వాలని కోరింది. త్వరలోనే దీనిపై సినిమాటోగ్రఫీశాఖ అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రకటన రాగానే బుకింగ్స్ ఓపెన్ అయ్యే అవకాశం ఉంది. ప్రభాస్ సరసన ముగ్గురు కథానాయికలు మాళవిక మోహనన్, రిద్ధికుమార్, నిధి అగర్వాల్ నటిస్తుండగా, సంజయ్‌దత్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందించిన పాటలు ఇప్పటికే యువతను ఆకట్టుకుంటున్నాయి.

## టాక్సిక్‌లో
# రుక్మిణీ వసంత్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్‌దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో రుక్మిణి వసంత్ ఉన్నట్లు టీమ్ ప్రకటించింది. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మోడ్రన్ డ్రెస్‌లో పబ్‌లో నడుస్తూ రుక్మిణి కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌ల లుక్‌ను విడుదల చేశారు. ఇప్పుడు రుక్మిణి కూడా అందులో ఉన్నట్లు అధికారికమైంది. దీంతో ఇందులో నలుగురు హీరోయిన్స్ అయ్యారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్‌గా, నయనతార గంగ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.



## రొమాంటిక్ కామెడీ జానర్‌లో నటించాలని ఉంది
### నటి దీపికా పడుకొనె వెల్లడి



తనకు రొమాంటిక్ కామెడీ చిత్రాల్లో నటించాలనుందని నటి దీపికా పదుకొణె చెప్పారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా కొంతమంది అభిమానులతో ముచ్చటించారు. రొమాంటిక్ కామెడీ చిత్రాల్లో నటించాలని ఉందని, కచ్చితంగా చేస్తాను. నాకు చాలా ఇష్టమైన జానర్‌లలో అదీ ఒకటి. ప్రేక్షకులు కూడా అలాంటి సినిమాలను ఇష్టపడతారు. నేను, నా టీమ్ కొన్నిరోజులుగా ఇలాంటి కథల కోసం వెతుకుతున్నాం. కానీ, ప్రస్తుతం ఈ రకమైన చిత్రాలకు మద్దతు ఇచ్చే నిర్మాతలు చాలా తక్కువ మంది ఉన్నారు. ఇవి రాసే రైటర్స్ కూడా తగ్గిపోయారని దీపిక అన్నారు. ఒకవేళ ఆ సినిమా చేస్తే.. అందులో హీరోగా ధురంధర్ (రణ్‌వీర్‌సింగ్) అయితే ఓకే అని సరదాగా బదులిచ్చారు.'ఓటీటీ వేదికగా అలాంటి చిత్రాల్లో నేను నటిస్తే మీరు బాధపడరు కదా?' అని దీపికా అభిమానులను అడిగారు. దీంతో త్వరలోనే ఈ స్టార్ హీరోయిన్ ఓటీటీ ఎంట్రీ ఇవ్వనున్నారా..? అంటూ వార్తలు మొదలయ్యాయి. చివరిగా దీపిక 'కల్కి 2898ఏడీ'లో సుమతిగా కనిపించి ఆకట్టుకున్నారు. ప్రస్తుతం షారుక్ సరసన 'కింగ్'లో నటిస్తున్నారు. అలాగే అల్లు అర్జున్ హీరోగా అట్లీ తెరకెక్కిస్తున్న ప్రాజెక్ట్‌లోనూ లీడ్ రోల్‌లో సందడి చేయనున్నారు.



## నేనిప్పుడే పెళ్లి చేసుకోవడం లేదు
### రూమర్స్‌కు చెక్ పెట్టిన మీనాక్షి చౌదరి

'అనగనగా ఒక రాజు'తో ఈ సంక్రాంతికి అలరించడానికి సిద్ధమయ్యారు నటి మీనాక్షి చౌదరి. నవీన్ పొలిశెట్టితో కలిసి ఆమె నటించిన ఈ చిత్రం జనవరి 14న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మీనాక్షి తన పెళ్లంటూ వస్తోన్న రూమర్స్‌పై స్పందించారు. 'లక్కీ భాస్కర్' తర్వాత తల్లి పాత్రలు చేయడానికి మీకు ఆసక్తి లేదని చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి.. నిజమేనా?' అనే ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. అసలు రూమర్స్ ఎలా సృష్టిస్తారో నాకు అర్థం కావట్లేదు. నేను అలాంటి కామెంట్స్ ఎక్కడా చేయలేదు. కథ, పాత్రకు ప్రాధాన్యమిస్తాను. కథ బాగుంటే ఎలాంటి పాత్రలోనైనా చేస్తాను. నేను పెళ్లి చేసుకోనున్నట్లు కూడా ఇటీవల ఎన్నో వార్తలు వచ్చాయి. అలాంటి రూమర్స్ విని నేను అలసిపోయాను. వాటిలో నిజం లేదు. నేను ఇప్పుడే పెళ్లి చేసుకోవడం లేదు' అని మీనాక్షి స్పష్టతనిచ్చారు. టాలీవుడ్ యంగ్ హీరోతో మీనాక్షి ప్రేమలో ఉన్నట్లు ఇటీవల జోరుగా ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని త్వరలోనే పెళ్లి చేసుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల ఆమె టీమ్ ఈ రూమర్స్‌ను ఖండించినప్పటికీ ఇవి ఆగలేదు. ఇప్పుడు ఏకంగా మీనాక్షినే దీనిపై స్పష్టతనిచ్చి చెక్ పెట్టారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com